కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :175 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ ఆదివారం 01-11-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

కండరాల క్షీణతతో బాధపడే చిన్నారులకు అండగా ఉంటాం: సజ్జనార్



హైదరాబాద్: కండరాల క్షీణత, బలహీనత (మస్క్యులర్ డిస్ట్రోఫీ)తో బాధపడే చిన్నారులకు అండగా ఉంటామని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ భరోసా కల్పించారు. మస్క్యులర్ డిస్ట్రోఫీని జెనెటిక్ టెస్టుల ద్వారానే అరికట్టగలమని వ్యాఖ్యానించారు. కండరాల క్షీణత వ్యాధిపైన దేశవ్యాప్తంగా విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో సీపీ సజ్జనార్ మాట్లాడారు. చాలా ప్రాంతాల్లో కండరాల క్షీణతతో బాధపడుతున్న చిన్నారులను తాను చూశానని తెలిపారు. బాధిత పిల్లలకు భారత్ ఎండీ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా భారత్ ఎండీ ఫౌండేషన్‌ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు.

ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలి..

మనలో ప్రతి ఒక్కరికీ సామాజిక బాధ్యత ఉండాలని సీపీ సజ్జనార్ సూచించారు. కండరాల క్షీణత అనేది చాలా తీవ్రమైన వ్యాధి అని చెప్పుకొచ్చారు. ఈ రోజుల్లో చాలామంది పిల్లలను కన్న తర్వాత చెత్తకుప్పల్లో పడేస్తున్నారని.. కానీ పిల్లలకు తీవ్రమైన వ్యాధి ఉన్నప్పటికీ, వాళ్లను అపురూపంగా చూసుకుంటున్నారని... అలాంటి తల్లిదండ్రులు చాలా గ్రేట్ అని అభినందించారు. ఈ వ్యాధి ఉన్న చిన్నారుల సింగిల్ పేరెంట్స్‌ను కూడా తాను చాలామందిని చూశానని అన్నారు. అలాంటి తల్లిదండ్రులకు తగిన గుర్తింపు ఇవ్వాలని సూచించారు.

ఆ చిన్నారులు స్ఫూర్తిదాయకం..

దాదాపుగా 60 మంది చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని సజ్జనార్ తెలిపారు. ఈ 60 మంది పిల్లలు చాలామంది వెరీ టాలెంటెడ్‌గా ఉన్నారని.. వాళ్లు మన అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అన్ని అవయవాలు సక్రమంగా ఉన్నవాళ్లే కొంతమంది జీవితం భారంగా ఉందని ఫీల్ అవుతారని తెలిపారు. కానీ తీవ్రమైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల్లో చిరునవ్వును చూసి తనకు చాలా ఆనందంగా అనిపించిందని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

వేదాలు భారతీయ సంస్కృతికి ప్రాణం: గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



యాదాద్రి భువనగిరి: వేద జ్ఞానమే భారతీయ నాగరికత, సంస్కృతులకు మూలాధారమని, వేదాలు కేవలం ఆధ్యాత్మిక చింతనకే పరిమితం కాకుండా ప్రకృతి పరిరక్షణ, మానవ జీవనం, నైతిక విలువలు, సామాజిక సామరస్యానికి మార్గదర్శకాలని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో నిర్వహించిన 26వ తెలంగాణ వేద విద్వన్మహాసభల్లో శనివారం గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, తరతరాలుగా వేదాలను పరిరక్షిస్తూ వస్తున్న గురు–శిష్య పరంపర భారతీయ సంస్కృతిలో అత్యంత విశిష్టమైనదని కొనియాడారు. ఆచార్యులు తమ నిరంతర సాధన, అంకితభావంతో వేదాల శుద్ధ ఉచ్చారణ, స్వర, పాఠ సంప్రదాయాలను పరిరక్షిస్తూ వస్తున్నారని పేర్కొన్నారు. ఈ మహాసభల్లో భాగంగా నిర్వహిస్తున్న వేద పరీక్షల్లో పాల్గొంటున్న 500 మందికి పైగా విద్యార్థులకు గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. వారి కృషి, క్రమశిక్షణ భారతీయ సాంస్కృతిక వారసత్వం ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. జయపత్రాలు అందుకున్న 10 మంది వేద విద్వాంసులను ప్రత్యేకంగా అభినందించారు. యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రం వేద అధ్యయనం, ఆధ్యాత్మిక సాధన, సాంస్కృతిక చైతన్యానికి ప్రముఖ కేంద్రంగా ఎదిగేందుకు అపార అవకాశాలు ఉన్నాయని గవర్నర్ పేర్కొన్నారు.

ప్రాచీన భారతీయ జ్ఞాన సంపదకు, ఆధునిక విజ్ఞానానికి మధ్య సార్థకమైన అనుసంధానం అవసరమని అన్నారు. వేద విద్యా సంస్థలు, విద్వత్ సభలు, గురుకులాలకు మరింత ప్రోత్సాహం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి డి. శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, ధార్మిక సలహాదారు ఆర్. గోవింద్ హరి, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, దేవస్థానం ఈవో జె. భవానీ శంకర్, వేద పండితులు పాల్గొన్నారు.

బెంగళూరులోని యలహంక ప్యాలెస్ నా బిడ్డల హక్కు : వైఎస్ షర్మిల



హైదరాబాద్,ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహ వేదిక మార్పుపై ఎట్టకేలకు స్పందించారు. యలహంక ప్రాపర్టీ, వివాహ వేదిక అంశంపై జరుగుతున్న పరిణామాలపై ఆమె తీవ్ర భావోద్వేగంతో ఒక ప్రకటన విడుదల చేశారు. సొంత ఇంటిలోనే తన బిడ్డ పెళ్లి చేయాలని ప్రతి తల్లిదండ్రులు ఆశపడతారని, కానీ కొన్ని పరిస్థితుల వల్ల ఆ కోరిక నెరవేరలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

దేవుడి సాక్షిగా యలహంక ఆస్తి మాదే:

నాది కాని దానికోసం ఆశపడే నీచత్వం నాది కాదు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు ముఖ్యమంత్రి అయ్యాక, అప్పటి వరకు ఉమ్మడి ఆస్తిగా ఉన్న యలహంక ప్రాపర్టీ.. ఆస్తుల పంపకాల్లో భాగంగా పూర్తిగా 100 శాతం నా, నా పిల్లల భాగానికి వచ్చింది. ఇది దేవుడి సాక్షిగా నిజం అని షర్మిల స్పష్టం చేశారు. వైఎస్సార్ తిరిగిన ఇల్లు కావడంతో పాటు, అది తమ పిల్లల హక్కు అయినందున తన కుమార్తె అంజలి కోరిక మేరకు అక్కడే వివాహం జరపాలనుకున్నట్లు షర్మిల తెలిపారు. సొంత ఇంట్లో బిడ్డ పెళ్లి చేయడం ప్రతి తల్లిదండ్రులకు అదృష్టమని, కానీ తాను పెరిగిన ఇల్లే పెళ్లి వేదిక కావాలన్న బిడ్డ ఆకాంక్షను నెరవేర్చలేకపోయామని ఆమె చాలా బాధపడ్డారు.నా కుమార్తె అంజలి పెళ్లి పెద్దలు కుదిర్చిన సంబంధం. వివాద రహితంగా, ఎలాంటి గొడవలు లేకుండా వివాహం జరిపించాల్సిన బాధ్యత మా మీద ఉంది. అందుకే వైఎస్ అంజలి రెడ్డి – సోమల రఘురామ్ రెడ్డిల పరిణయ వేడుకను యలహంక ఇంట్లో కాకుండా, వేరే ప్రదేశంలో బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో నిర్వహించాలని నిశ్చయించుకున్నాం” అని షర్మిల వెల్లడించారు. కాబోయే నవదంపతులకు తెలుగు ప్రజల ఆశీస్సులు, దీవెనలు ఉండాలని ఆమె మనసారా ఆకాంక్షించారు. అలాగే వివాహ వేదిక విషయంలో జరుగుతున్న పరిణామాలను చూసి తన బిడ్డ గురించి బాధపడిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ డ్రామాలను సహించేదే లేదు..



హైదరాబాద్, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థలను అవమానించడమే పనిగా పెట్టుకుందని, పార్లమెంట్‌ను మాక్ పార్లమెంట్ పేరిట హేళన చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శించారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు శాంతికుమార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఓఎస్ రెడ్డితో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సుప్రీంకోర్టును అవహేళన చేస్తూ రిటైర్డ్ జడ్జీలతో పిటిషన్లు తీసుకుంటూ కంగారూ కోర్టు తరహా విచారణలు నడిపిన చరిత్ర కాంగ్రెస్‌దని రాంచందర్ రావు మండిపడ్డారు. 2010లో వేతనాల పెంపు కోసం లాలూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ పార్లమెంట్ లోపలే మాక్ పార్లమెంట్ నిర్వహించినప్పుడు.. అప్పటి స్పీకర్ మీరా కుమార్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ పార్లమెంట్ ఒక పవిత్ర ప్రజాస్వామ్య దేవాలయమని హెచ్చరించారని, స్వయంగా సోనియా గాంధీ సైతం దానిని ఏ మాకరీ ఆఫ్ డెమోక్రసీ అని తీవ్రంగా తప్పుబట్టారని గుర్తుచేశారు.

స్పష్టమైన డీపీఆర్ ఏది?

నాడు అలా మాట్లాడిన కాంగ్రెస్ నేతలు, నేడు అదే తరహాలో మాక్ పార్లమెంట్ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణకు తాము వ్యతిరేకం కాదని, నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా ఇళ్లు కూల్చితే మాత్రం సహించేది లేదని రాంచందర్ రావు హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీ కార్పొరేషన్‌కు రూ. 750 కోట్ల అంచనా వ్యయం చూపించి చివరకు రూ.3 కోట్లు మాత్రమే విదిల్చి చేతులు దులుపుకుందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేల కోట్ల అంచనాలు చెబుతూ స్పష్టమైన డీపీఆర్, బడ్జెట్ కేటాయింపులు చూపకుండా ముందుకు వెళ్తోందని ఆరోపించారు.

నవంబర్ 2వ తేదీన అమిత్ షా పర్యటన..

నవంబర్ 2వ తేదీన కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటనకు వస్తున్నారని రాంచందర్ రావు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నుంచి మొజాంజాహీ మార్కెట్ చౌరస్తా వరకు చారిత్రక మహా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. ఇండీ కూటమి ర్యాలీ కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను కేటాయించలేదని కాంగ్రెస్ చేస్తున్న విమర్శలను రాంచందర్ రావు తిప్పికొట్టారు. రైల్వే శాఖ నిబంధనల ప్రకారం ప్రత్యేక రైళ్ల బుకింగ్ ప్రక్రియ నెలల ముందుగా జరగాలని, నిర్దిష్ట రుసుము చెల్లించి అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని గుర్తుచేశారు. రైల్వేపై అసత్య ప్రచారాలు ఇకనైనా మానుకోవాలని ఆయన సూచించారు. ఈ మీడియా సమావేశం అనంతరం నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, రిటైర్డ్ ఉన్నతాధికారులు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు.

మియాపూర్ భూముల వేలం నిర్ణయం దివాలాకోరుతనం

హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన మియాపూర్ 550 ఎకరాల భూములపై సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం సుప్రీంకోర్టు వెలువరించిన చారిత్రాత్మక తీర్పును స్వాగతిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు స్పష్టం చేశారు. అయితే, కోర్టు తీర్పు వెలువడిన వెంటనే ఏమాత్రం ఆగకుండా, ఒక రియల్ ఎస్టేట్ ప్రభుత్వంలా మారిపోయి ఆ భూములను ఇష్టానుసారంగా వేలం వేసి అమ్మేస్తామని ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. అమిత్ షా హైదరాబాద్ వస్తున్నారంటేనే కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని పేర్కొన్నారు.

తెలంగాణలో క్రాప్ హాలిడేపై మంత్రి తుమ్మల క్లారిటీ



హైదరాబాద్: రాష్ట్రంలో క్రాప్ హాలిడేపై తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో ప్రభుత్వం ఎక్కడా క్రాప్ హాలిడే ప్రకటించలేదని స్పష్టం చేశారు. ఈరోజు (శనివారం) హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి తుమ్మల మాట్లాడారు. క్రాప్ హాలిడేపై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న ప్రచారం అవాస్తవమని.. రైతులు ఈ విషయాన్ని నమ్మొద్దని అన్నారు. ఎల్‌నినో ప్రపంచవ్యాప్త విపత్తు అని.. ఈ విషయంలో ముందస్తు జాగ్రత్తలను తాము తీసుకుంటున్నామని తెలిపారు. ఆరు నెలలుగా రైతన్నలకు ఎల్‌నినోపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అధిక నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ఆరుతడి, సమీకృత పంటల సాగుకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు.

రైతన్నలు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలి..

ప్రతి వారం వాతావరణం, వర్షపాతం, భూగర్భ జలాల వివరాలను అన్నదాతలకు చేరవేస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. రైతులకు సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో 365 మండలాలను కరవు మండలాలుగా ప్రకటించి, రైతన్నలకు అండగా తమ ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఖరీఫ్ పంటలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాన్నామని చెప్పారు. అన్నదాతలకు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తోందని తెలిపారు. రైతన్నలను నష్టాల నుంచి కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలిక ఆదాయం వస్తోందని.. ప్రభుత్వ ప్రోత్సాహకాలు కల్పిస్తోందని వెల్లడించారు. నవంబర్ నుంచి మార్చి వరకు మొత్తం 35.21 లక్షల ఆయిల్‌పామ్ మొక్కలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రైతన్నలు ఆయిల్‌పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. తాగునీటి కోసం రూ.120 కోట్లు..



హైదరాబాద్,ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ల తో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామా లు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నా య ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ హయాంలో పటేల్‌కు దక్కాల్సిన గౌరవం దక్కలేదు..



న్యూఢిల్లీ :సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌కు దక్కాల్సిన గౌరవం కాంగ్రెస్ పాలనలో లభించలేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఆయనను పక్కనపెట్టి, ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేసేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రయత్నించిందని ఆరోపించారు. పటేల్ 151వ జయంతి సందర్భంగా శనివారం ఢిల్లీలో నిర్వహించిన ‘ఏక్తా రన్’ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సర్దార్ పటేల్ స్మారకంగా ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహమైన ‘స్టాచ్యూ ఆఫ్ యూనిటీ’ని నిర్మించారని షా గుర్తుచేశారు. ఈ స్మారక నిర్మాణం ద్వారా పటేల్ సేవలు, ఆయన వ్యక్తిత్వాన్ని దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేశారని పేర్కొన్నారు. దేశ సమైక్యతకు పటేల్ చేసిన కృషిని అమిత్ షా ప్రస్తావించారు. కేవలం 1,218 రోజుల్లోనే ఆయన అవిభాజ్య భారతదేశ నిర్మాణానికి పునాది వేశారని అన్నారు. పలువురు నాయకులు కలిసి జీవితకాలంలో సాధించలేని పనులను పటేల్ తక్కువ సమయంలోనే పూర్తి చేశారని వ్యాఖ్యానించారు. దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రజలంతా సహకరించాలని షా పిలుపునిచ్చారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను పూర్తిగా డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ‘నషా ముక్త్ భారత్’ సాధనతోనే ‘వికసిత్ భారత్’ లక్ష్యం దిశగా ముందడుగు వేయగలమని అన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజం నిర్మూలన దిశగా దేశం పురోగతి సాధించిందని పేర్కొన్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు షా చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయిలో భారత్‌లో విలీనమైందని, నక్సలిజం నిర్మూలనకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు.



సంపాదకీయం

ఆదివారం 01-11-2026

అమెరికా మధ్యంతరం... రిపబ్లికన్లకు ఇరకాటం

అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు)కు నవంబర్ 3న మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. 2024 ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ పార్టీ రిపబ్లికన్లకు కాంగ్రెస్ ఉభయ సభల్లో మెజారిటీ దక్కింది. అయితే ప్రతిపక్ష డెమోక్రాట్లు ఈసారి దిగువ సభను చేజిక్కించుకోవడానికీ, ఎగువ సభ సెనేట్‌లో ఆధిక్యం సాధించడానికీ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి. 'డెసిషన్ డెస్క్ హెచ్.క్యూ' అనే డేటా అంచనా సంస్థ ప్రకారం, డెమోక్రాట్లకు ప్రతినిధుల సభలో సుమారు 238 సీట్లు గెలవడానికి 79 శాతం, సెనేట్‌ను దక్కించుకోవడానికి 57 శాతం వీలుంది.రాయిటర్స్/ఇప్సోస్ పోల్‌లో ట్రంప్‌కు ప్రజామోదం 31శాతానికి పడిపోయింది. ఇది ఆయన రెండు దఫాల పాలనలో అత్యంత కనిష్ఠం. సాధారణ కాంగ్రెషనల్ బ్యాలెట్‌లో డెమోక్రాట్లు 47శాతంతో రిపబ్లికన్లపై (35శాతం) ఆధిక్యంలో ఉన్నారు. ఎగువ సభ సెనేట్‌లో రిపబ్లికన్లకు ప్రస్తుతం 53 సీట్లు ఉన్నాయి. డెమోక్రాట్లు సెనేట్‌లో మెజారిటీ సాధించాలంటే రిపబ్లికన్ల వైపు మొగ్గు ఉన్న రాష్ట్రాల్లో ఈసారి అదనంగా నాలుగు సీట్లు సాధించాలి. 2024లో ట్రంప్ సునాయాసంగా గెలిచిన రాష్ట్రాల్లో డెమోక్రాట్లు ఈసారి గట్టి పోటీ ఇస్తున్నారు. ముఖ్యంగా అయోవా, ఒహైయో, టెక్సాస్ వంటి రాష్ట్రాల్లో పోటీలు హోరాహోరీగా మారాయి. రిపబ్లికన్ల మరో అడ్డా అలస్కా కూడా డెమోక్రాట్ల వైపు మొగ్గుచూపుతోంది. సాంప్రదాయంగా రిపబ్లికన్లకు మద్దతునిచ్చే రాష్ట్రాలు ఇప్పుడు ఆ పార్టీకి దూరంగా జరిగాయి. నార్త్‌కరోలైనా, జార్జియా, మిషిగాన్ వంటి రాష్ట్రాల్లో డెమోక్రాట్లు రిపబ్లికన్ల కంటే ముందున్నారు.

ప్రభావితం చేసే అంశాలివే...

మధ్యంతర ఎన్నికల్లో ప్రజల ఓటింగ్‌ను ప్రభావితం చేసే అంశాల్లో జీవన వ్యయం అత్యంత ప్రధానమైనది. అక్టోబర్ మధ్యలో అమెరికాలో డీజిల్ ధర గాలన్(3.8 లీటర్ల)కు సగటున ఆరు డాలర్లకంటే ఎక్కువగా ఉంది. ఈ ధర జనవరిలో 3.48 డాలర్లుగా ఉండేది; సెప్టెంబర్‌లో వార్షిక ద్రవ్యోల్బణం 3.7శాతానికి చేరుకుంది. కార్మిక మార్కెట్ కూడా మందగిస్తోంది. సెప్టెంబర్‌లో ఆర్థిక వ్యవస్థ కేవలం 29వేల ఉద్యోగాలను మాత్రమే జోడించింది. నిరుద్యోగిత రేటు 4.2 శాతానికి పెరిగింది. ఈ ఎన్నికల్లో ఓటర్ల దృష్టి విదేశీ విధానంపై కేంద్రీకృతం కావడం మరో కీలక పరిణామం. ఇరాన్‌తో ఎనిమిదో నెలకు చేరుకున్న యుద్ధం, హర్మూజ్ జలసంధిలో ఎదురవుతున్న అంతరాయాలు అమెరికాలో ఇంధన ధరలను పెంచేశాయి. అమెరికన్లలో మూడింట రెండొంతుల మంది దీనిపై ట్రంప్ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తున్నారు. రష్యాతో డీజిల్ ఒప్పందం ద్వారా ధరలను తగ్గించడానికి ఆయన చేసిన ప్రయత్నం రాజకీయంగా ఎదురుతన్నింది. ప్రముఖ రిపబ్లికన్ సెనేటర్ల నుంచి తీవ్ర అభ్యంతరాలను ఎదుర్కొంది. ఈ యుద్ధం ఒకవైపు ప్రజల జేబుకు చిల్లుపెడుతూ, మరోవైపు దేశాధ్యక్షుడి సమర్థతకు పరీక్షగా మారింది. ఈ ఎన్నికల్లో ప్రధానమైన ఇంకో అంశం నియోజకవర్గాల పునర్విభజన. ఇది పాలక, ప్రతిపక్షాలు రెండింటిపైనా ప్రభావం చూపుతుంది. ట్రంప్ కోరిక మేరకు రిపబ్లికన్లు టెక్సాస్ (అయిదు సీట్లు), ఫ్లోరిడా (నాలుగు), ఒహైయో (రెండు సీట్లు), నార్త్‌కరోలైనా, టెన్నెసీ, లూసియానా, అలబామాలలో నియోజకవర్గాల మ్యాపులను తిరగరాశారు. దానికి డెమోక్రాట్లు కాలిఫోర్నియా (అయిదు సీట్లు)లో సమాధానమిచ్చారు. కోర్టు ఉత్తర్వుల ద్వారా యుటాలో అదనంగా ఒక సీటును సాధించారు, కానీ వర్జీనియాలో ప్రజాభిప్రాయ సేకరణ రద్దయింది. మిస్సోరి కొత్త మ్యాప్‌ను ఈ ఏడాది ఉపయోగించడం లేదు. ఏతావాతా రిపబ్లికన్లు నియోజకవర్గ పునర్విభజనతో నికరంగా లబ్ధి పొందారు. ఇది వారికి ఎన్నికల్లో ఉపకరించవచ్చు. కాగా, ఒహైయోలో ట్రంప్ అనుయాయుడు, గతంలో 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ'కి అధిపతిగా ఉన్న వివేక్ రామస్వామి, గవర్నర్ రేసులో డెమోక్రాట్ అమీ ఆక్టన్‌కంటే ఎనిమిది పాయింట్లు వెనకబడి ఉన్నట్లు సీఎన్ఎన్ సర్వే చెబుతోంది. మరొక సర్వే ఆయన స్వల్పంగా ముందున్నారని పేర్కొంది. ప్రెడిక్షన్ మార్కెట్లు ఆక్టన్‌కు సుమారు 70శాతం గెలుపు అవకాశాలను ఇస్తున్నాయి. ఇక్కడ ఓటమి ఎదురైతే, ట్రంప్ రాజకీయ వర్గంలోని అత్యంత ప్రముఖ భారతీయ-అమెరికన్ వివేక్‌కు ఎదురుదెబ్బే అవుతుంది. ట్రంప్ మూడుసార్లు గెలిచిన ఒహైయోలోనూ ఆయన పార్టీ ఆపసోపాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిధుల సేకరణలో పాలక రిపబ్లికన్లకు సహజంగానే ఆధిక్యం ఉండగా, విపక్ష డెమోక్రాట్లకు కొరత ఎదురవుతోంది. కానీ, తక్కువ ఓటింగ్ నమోదయ్యే మధ్యంతర ఎన్నికల్లో అధిక ధరలు, యుద్ధంతో అసంతృప్తిగా ఉన్న ఓటర్ల మద్దతును పొందడంలో రిపబ్లికన్లు సఫలం కాగలరా అన్నదే ఆసక్తికర ప్రశ్న.

విధానాల్లో మార్పుండదా?

ఎన్నికల ఫలితాలు ట్రంప్ సర్కారు విధానాలను పెద్దగా మార్చకపోవచ్చనేది ఆందోళనకరమైన సంకేతం. నవంబర్ 3న పోలింగ్ పూర్తయ్యాక ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభమవుతాయని ట్రంప్ పదే పదే సూచించారు. యుద్ధ నౌకలను, 10వేల మంది అదనపు నావికులు, మెరైన్‌లను గల్ఫ్ వైపు పంపారు. ప్రతి దాడికీ ఇరాన్ సిద్ధమవుతోంది. ట్రంప్ ఇరాన్ యుద్ధాన్ని విరమించకపోగా సుంకాలు, వలస నిబంధనలను మరింత కఠినతరం చేయవచ్చు. స్వదేశంలో, విదేశాలలో మరింత దూకుడుగా వ్యవహరించవచ్చు. ప్రతినిధుల సభలో డెమోక్రాట్లకు మెజారిటీ వస్తే ట్రంప్ మూకుడుకు కొంతవరకు అడ్డుకట్ట వేయవచ్చన్న అంచనాలున్నా, ఆయన ఘర్షణాత్మక వైఖరినే కొనసాగించవచ్చు. రిపబ్లికన్లు సెనేట్‌లో మెజారిటీ నిలబెట్టుకుంటే న్యాయమూర్తులు, ఉన్నతాధికారుల నియామకాలను ఖరారు చేసే అధికారం ట్రంప్ చేతిలోనే ఉంటుంది. దాన్ని ఆయన తనకు అనువైన అస్త్రంగా వాడుకుంటారు. 2028 వరకు అమెరికా విధానాలు మరింత ఘర్షణాత్మకంగా, అంచనాకు అందనివిగా ఉంటాయని భారత్‌తో పాటు ఇతర భాగస్వామ్య దేశాలు గ్రహించాలి. ఇంధన మార్కెట్లలో నిరంతర హెచ్చుతగ్గులు తప్పకపోవచ్చు. యుద్ధాలు మరింత తీవ్రతరం కావచ్చు. మొత్తంగా మధ్యంతర ఎన్నికలనేవి రిఫరెండమ్ వంటివే అయినా, అవి ట్రంప్ మార్గాన్ని మార్చే అవకాశం తక్కువే!

తెలంగాణాకు నీటి సంక్షోభం.. ప్రభుత్వానికి పరీక్ష!



హైదరాబాద్,తెలంగాణలో రాబోయే నీటి సంక్షోభం కేవలం ప్రకృతి వైపరీత్యం కాదు. అది ప్రభుత్వ పాలనా సామర్థ్యానికి, వ్యవసాయ విధానాలకు, ప్రజల జీవన భద్రతకు ఎదురయ్యే కీలక పరీక్ష. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, ఉష్ణోగ్రతలు పెరిగి, జలాశయాల్లో నీటి నిల్వలు క్షీణిస్తే సాగునీరు, తాగునీరు రెండింటికీ తీవ్రమైన ఇబ్బందులు తప్పవు.ముఖ్యంగా తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు కొనసాగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయానికి ముప్పు..

తెలంగాణ వ్యవసాయం వర్షాలు, ప్రాజెక్టుల నీటి నిల్వలు, భూగర్భ జలాలపై ఆధారపడి ఉంది. వర్షాలు తగ్గితే చెరువులు నిండవు. జలాశయాల్లో నిల్వలు పడిపోతాయి. బోర్లు ఎండిపోతాయి. ఇప్పటికే నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. వరి వంటి అధిక నీటి వినియోగ పంటలను విచక్షణ లేకుండా సాగు చేస్తే అందుబాటులో ఉన్న నీరు వేగంగా ఖాళీ అవుతుంది. పంటలు ఎండిపోవడం, పెట్టుబడులు నష్టపోవడం, అప్పులు పెరగడం, వ్యవసాయ కూలీలకు ఉపాధి తగ్గడం వంటి పరిణామాలు గ్రామీణ జీవితాన్ని సంక్షోభంలోకి నెట్టవచ్చు.

తాగునీటి సమస్య మరింత తీవ్రమైతే..!

సాగునీటి కొరతతో పోలిస్తే తాగునీటి సమస్య ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తుంది. పట్టణాల్లో జలాశయాలు, నదుల నుంచి నీటి సరఫరా తగ్గితే ప్రత్యామ్నాయ వనరులపై ఒత్తిడి పెరుగుతుంది. గ్రామాల్లో బోర్లు, చేతిపంపులు పనిచేయకపోవచ్చు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన అవసరం ఏర్పడుతుంది. వేసవిలో నీటి కోసం ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే మహిళలు, వృద్ధులు, పిల్లలపై అదనపు భారం పడుతుంది. నీటి నాణ్యత తగ్గితే ఆరోగ్య సమస్యలు కూడా పెరిగే ప్రమాదం ఉంటుంది. అందువల్ల తాగునీటికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలి.

మూడు నెలల ముందస్తు కార్యాచరణ...

ప్రభుత్వం సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే సిద్ధపడాలి. రాబోయే మూడు నెలలను కీలకమైన సన్నద్ధత కాలంగా పరిగణించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఉన్నతస్థాయి నీటి భద్రతా సమీక్ష నిర్వహించాలి. ప్రతి జలాశయంలో ప్రస్తుతం ఎంత నీరు ఉందో తెలుసుకోవాలి. వచ్చే వేసవికి ఎంత నీరు అవసరమో లెక్కించాలి. జిల్లాలవారీగా నీటి లభ్యతపై నివేదికలు సిద్ధం చేయాలి. ప్రతి జిల్లాలో కలెక్టర్ అధ్యక్షతన నీటి సంక్షోభ నిర్వహణ కమిటీ ఏర్పాటు చేయాలి. సాగునీటి శాఖ, వ్యవసాయ శాఖ, మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు సమన్వయంతో పనిచేయాలి. నీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలను గుర్తించాలి. పనిచేయని బోర్లకు మరమ్మతులు చేయాలి. అవసరమైన చోట అదనపు నీటి నిల్వ ట్యాంకులు ఏర్పాటు చేయాలి. నీటి సరఫరాకు అవసరమైన ట్యాంకర్లను ముందుగానే సిద్ధం చేయాలి. ప్రజలకు నీటి సరఫరా సమయాలను ప్రకటించాలి. నీటి కొరత ఉన్న గ్రామాలను ప్రత్యేకంగా గుర్తించాలి. నీటి సరఫరా అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలి. వారానికొకసారి పరిస్థితిని సమీక్షించాలి. సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలి. ఈ విధంగా ముందస్తు ప్రణాళిక రూపొందిస్తే వేసవిలో ప్రజలకు నీటి భరోసా కల్పించవచ్చు.

ఆరు నెలల ప్రణాళిక...

వచ్చే ఆరు నెలల కాలానికి ప్రభుత్వం నీటి వినియోగానికి ప్రాధాన్యత క్రమాన్ని ప్రకటించాలి. మొదట తాగునీరు, తరువాత పశువుల అవసరాలు, ఆపై అందుబాటులో ఉన్న నీటిని వ్యవసాయానికి కేటాయించాలి. అయితే రైతులకు అన్యాయం జరగకుండా ఆయకట్టు ప్రాంతాలకు పారదర్శకమైన నీటి పంపిణీ ప్రణాళిక ఉండాలి. నీటి లభ్యత ఆధారంగా పంటల సాగు ప్రణాళిక రూపొందించాలి. రైతులకు ముందుగానే ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలి. తక్కువ నీటితో పండే పంటలకు విత్తనాలు అందించాలి. అధిక నీటి వినియోగ పంటల సాగుపై వ్యవసాయ నిపుణుల సూచనలు తీసుకోవాలి. సాగునీటి విడుదలలో రైతులకు ముందుగానే సమాచారం ఇవ్వాలి.

వేసవి సంక్షోభాన్ని ఎదుర్కోవడమెలా?

గ్రామాల్లో నీటి వనరుల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలి. మహిళలు, వృద్ధులు, పిల్లలకు నీటి కోసం అదనపు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి. పట్టణాల్లో నీటి సరఫరా వ్యవస్థపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి. తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయం కల్పించాలి. నీటి సరఫరాపై వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి సమస్యలను పరిశీలించాలి. నీటి పంపిణీలో రాజకీయ వివక్షకు తావివ్వకూడదు. పారదర్శకత, సమన్వయం, బాధ్యతాయుతమైన పాలనతో వేసవి సంక్షోభాన్ని ఎదుర్కోవాలి.

నీటి వనరుల ఆక్రమణలు తొలగించాలి!

తెలంగాణలో ప్రతి వర్షపు చుక్కను నిల్వ చేసుకునే విధంగా చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యత ఇవ్వాలి. వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణను విస్తరించాలి. పట్టణాల్లో వర్షపు నీటి సేకరణను ప్రోత్సహించాలి. నీటి వనరుల ఆక్రమణలను తొలగించాలి. వ్యవసాయంలో సూక్ష్మసేద్యం, నీటి పొదుపు పద్ధతులను విస్తరించాలి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం తప్పనిసరిగా వస్తుందని భావించకుండా వాతావరణ శాఖ సూచనలను సమీక్షించాలి. పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలను మార్చుకోవాలి.

ఇది ముందస్తు పాలనా పరీక్ష!

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇది ముందస్తు పాలనా పరీక్ష. ప్రజలకు నీరు అందకపోతే ప్రభుత్వంపై అసంతృప్తి తీవ్రమవుతుంది. కాబట్టి సంక్షోభాన్ని రాజకీయంగా ఎదుర్కోవడం కంటే పరిపాలనాపరంగా నివారించడం ముఖ్యం. ఇప్పుడే కార్యాచరణ ప్రారంభిస్తే వేసవిలో ప్రజలకు భరోసా ఇవ్వవచ్చు. ఆలస్యమైతే నీటి కొరత ప్రభుత్వానికి తీవ్రమైన రాజకీయ సవాలుగా మారే ప్రమాదం ఉంది. నీటి భద్రతపై తీసుకునే నిర్ణయాలే రేవంత్ రెడ్డి ప్రభుత్వ బాధ్యతాయుత పాలనకు నిదర్శనం.

డివైడర్‌ను ఢీకొట్టిన బొలెరో

యడ్లపాడు,జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న ఈ వాహనం యడ్లపాడు సమీపానికి చేరుకోగానే, మితిమీరిన వేగం, డ్రైవర్ నిద్రమత్తుతో పాటు అకస్మాత్తుగా టైర్

హైదరాబాద్‌కు నీటి గండం?



హైదరాబాద్,ఎల్‌నినో.. ఈ పేరు వినగానే రైతులు, వాతావరణ నిపుణులతో పాటు నగర ప్రజల్లోనూ ఆందోళన మొదలవుతుంది. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పులు భారత రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో ఎల్‌నినో పరిస్థితులపై అందరి దృష్టి ఉంటుంది. ముఖ్యంగా హైదరాబాద్ వంటి వేగంగా విస్తరిస్తున్న మహానగరంలో వర్షపాతం తగ్గితే దాని ప్రభావం తాగునీటి లభ్యతపై పడే అవకాశం ఉంది. అయితే ఎల్‌నినో ఏర్పడిందంటే హైదరాబాద్‌లో తప్పనిసరిగా కరువు వస్తుందని, నగరానికి తాగునీటి కొరత ఏర్పడుతుందని చెప్పలేం. వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలాలు, నగర నీటి వినియోగం వంటి అంశాలన్నీ కలిసి పరిస్థితిని నిర్ణయిస్తాయి.

తగ్గిన జలాశయాల నిల్వలు.. ఆందోళన కలిగిస్తున్న గణాంకాలు

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ప్రధానంగా ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, సింగూరు, మంజీరా, అక్కంపల్లి జలాశయాలపై ఆధారపడుతోంది. వీటితోపాటు కృష్ణా, గోదావరి జలాలనూ నగరానికి తరలిస్తున్నారు. అయితే ఈ ఏడాది వర్షపాతం లోటు, జలాశయాలకు ఆశించిన స్థాయిలో వరద ప్రవాహాలు లేకపోవడం నీటి నిల్వలపై ప్రభావం చూపుతోంది. అక్టోబర్ 24 నాటికి హైదరాబాద్‌కు నీటిని అందించే ఐదు ప్రధాన జలాశయాల్లో కలిపి 8.9 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 25.904 టీఎంసీల నిల్వ ఉండేది. అంటే ఏడాదిలోనే దాదాపు 16.95 టీఎంసీల నీటి నిల్వ తగ్గిపోయింది.ముఖ్యంగా సింగూరు జలాశయంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గత ఏడాది అక్టోబర్‌లో 16.62 టీఎంసీల నిల్వ ఉండగా.. ఈ ఏడాది అదే సమయానికి 3.14 టీఎంసీలకు పడిపోయింది. మంజీరాలోనూ గత ఏడాదితో పోలిస్తే 84 శాతానికి పైగా నిల్వలు తగ్గాయి. ఈ గణాంకాలు నగర నీటి భద్రతపై ఆందోళనలను పెంచుతున్నాయి.

100 ఎంజీడీల నీటి లోటు.. జలమండలి అంచనా

రానున్న వేసవిలో హైదరాబాద్ తాగునీటి సరఫరాకు సంబంధించి జలమండలి ముందుగానే అప్రమత్తమైంది. సింగూరు, మంజీరా జలాశయాల నుంచి జనవరి నుంచి ఆగస్టు మధ్య సుమారు 100 మిలియన్ గ్యాలన్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం నగరానికి రోజుకు 560 నుంచి 570 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు గోదావరి, కృష్ణా, ఉస్మాన్‌సాగర్ వనరుల నుంచి అదనంగా 60 ఎంజీడీల నీటిని అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళికలు రూపొందించారు. అయినప్పటికీ 40 నుంచి 50 ఎంజీడీల లోటు మిగిలే అవకాశం ఉందని జలమండలి అంచనా వేసింది.

ఈ లోటు ప్రభావం పటాన్‌చెరు నుంచి నార్సింగి వరకు దాదాపు మూడు లక్షల నీటి కనెక్షన్లపై పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. దీనికి సంబంధించి అత్యవసర కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వానికి సమర్పించారు.

మూడు రోజులకు ఒకసారి నీళ్లు వస్తాయా?

జలాశయాల్లో నిల్వలు మరింత తగ్గితే నగరంలో నీటి సరఫరా విధానాన్ని మార్చాల్సిన పరిస్థితి రావచ్చనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో అమలవుతున్న రోజు విడిచి రోజు నీటి సరఫరాను.. మూడు రోజులకు ఒకసారి సరఫరా చేసే విధానానికి మార్చే అవకాశాన్ని అధికారులు పరిశీలిస్తున్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఇప్పటికే నగరంలో ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. రోజువారీ ట్యాంకర్ బుకింగ్స్ గత ఏడాదితో పోలిస్తే గణనీయంగా పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. భూగర్భ జలాలు తగ్గిపోవడం, బోర్లు ఎండిపోవడం కూడా సమస్యను తీవ్రతరం చేసే అంశాలుగా మారాయి. అయితే మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా అనేది ఇంకా అమలులోకి వచ్చిన నిర్ణయం కాదు. జలాశయాల పరిస్థితిని బట్టి తీసుకునే అవకాశం ఉన్న ప్రత్యామ్నాయ చర్య మాత్రమే.

భూగర్భ జలాలపైనా ఒత్తిడి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరుగుతోంది. కొత్త నివాస సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణంతో నీటి వినియోగం కూడా పెరుగుతోంది. అనేక ప్రాంతాల్లో ప్రజలు బోర్లపైనే ఆధారపడుతున్నారు. వర్షాలు తక్కువగా కురిస్తే భూగర్భ జలాల పునరుద్ధరణ మందగిస్తుంది. ఫలితంగా బోర్లలో నీటి మట్టాలు తగ్గి ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఇప్పటికే నీటి ట్యాంకర్లకు డిమాండ్ పెరగడం ఈ పరిస్థితికి సంకేతంగా కనిపిస్తోంది. మరోవైపు వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగితే గృహాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల్లో నీటి వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది.

నగరాన్ని కాపాడేందుకు ఎలాంటి చర్యలు అవసరం?

రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని జలమండలి పలు ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

- గోదావరి, కృష్ణా జలాల తరలింపును సమర్థంగా వినియోగించుకోవాలి.
-అందుబాటులో ఉన్న జలాశయాల నీటిని ప్రణాళికాబద్ధంగా పంపిణీ చేయాలి.
-లీకేజీలను అరికట్టి నీటి వృథాను తగ్గించాలి.
- హైదరాబాద్‌కు నిజంగానే నీటి కష్టాలు తప్పవా?

ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే హైదరాబాద్‌కు రానున్న వేసవిలో తాగునీటి నిర్వహణ పెద్ద సవాల్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవైపు బలపడుతున్న ఎల్‌నినో.. మరోవైపు తగ్గిన జలాశయాల నిల్వలు, పడిపోతున్న భూగర్భ జలాలు, పెరుగుతున్న నగర జనాభా.. ఇవన్నీ నీటి భద్రతపై ఒత్తిడి పెంచుతున్నాయి. మొత్తంగా.ఎల్‌నినో ప్రభావం కంటే ప్రస్తుతం హైదరాబాద్‌ను ఎక్కువగా ఆందోళనకు గురిచేస్తున్న అంశం జలాశయాల్లో తగ్గిన నీటి నిల్వలు. 2027 వేసవిలో నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలంటే ఇప్పటి నుంచే నీటి పొదుపు, ప్రత్యామ్నాయ జల వనరుల వినియోగంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఈఎస్ఐ హౌస్ కీపింగ్‌లో ఏం జరుగుతోంది?

హైదరాబాద్,తెలంగాణలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల ఖర్చు భారీగా పెరిగింది. ఈ సేవలకు చెల్లించే చార్జీలను ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) అధికారులు భారీగా పెంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2024లో చదరపు అడుగుకు రూ.10గా ఉన్న చార్జీని 2025లో రూ.25కు, తాజాగా రూ.49.50కు పెంచారు. కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ చెల్లింపులకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. దీంతో గతేడాదితో పోలిస్తే 2026లో ఈ సేవలపై దాదాపు రూ.50 కోట్ల అదనపు భారం పడుతోంది. టెండర్లు నిర్వహించకుండా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు అప్పగించడంపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అద్దె కంటే తొమ్మిది రెట్లు ఎక్కువ ఖర్చు ఖైరతాబాద్‌లో 3,060 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె భవనంలో కొనసాగుతోంది. చదరపు అడుగుకు రూ.15 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ చదరపు అడుగుకు రూ.10 అద్దె చెల్లించాలని నిర్ణయించినప్పటికీ, భవనాల లభ్యత, డిమాండ్‌ను బట్టి యజమానితో చర్చించి అద్దెను ఖరారు చేశారు. దీంతో ప్రభుత్వం నెలకు దాదాపు రూ.45,900 చెల్లిస్తోంది. కేన్సర్ చికిత్సలో కొత్త ప్రయోగాలు అయితే, ఇదే భవనంలో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల కోసం నెలకు దాదాపు రూ.4.15 లక్షలు ఖర్చు చేస్తుండటం గమనార్హం. భవనం అద్దెతో పోలిస్తే ఈ వ్యయం తొమ్మిది రెట్లు ఎక్కువ. హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకు రూ.70.49, సెక్యూరిటీ సేవలకు రూ.65.17 చొప్పున చెల్లిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఇతర డిస్పెన్సరీల్లోనూ ఇదే తరహాలో అధిక వ్యయం చేస్తున్నట్లు ఐఎంఎస్ లెక్కలు సూచిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతీయ ఈఎస్ఐ ఆస్పత్రులు, రెండు దయాగ్నొస్టిక్ కేంద్రాలు, 71 డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో 53 డిస్పెన్సరీలు హైదరాబాద్ రీజియన్ పరిధిలో, 18 వరంగల్ రీజియన్ పరిధిలో ఉన్నాయి. రాష్ట్రంలో 21 లక్షల మంది ఈఎస్ఐ చందాదారులు ఉండగా, వారి కుటుంబసభ్యులతో కలిపి 90 లక్షల నుంచి కోటి మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు చార్జీలు పెరిగినా ఉద్యోగులకు అందని ప్రయోజనం ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల బాధ్యతలను ఐఎంఎస్ డైరెక్టరేట్ పర్యవేక్షిస్తోంది. కాంట్రాక్టర్ల ఎంపిక, ధరల నిర్ణయం, బిల్లుల చెల్లింపులు ఈ విభాగం పరిధిలోనే జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,78,455 చదరపు అడుగుల విస్తీర్ణానికి ఈ సేవలు అందించాల్సి ఉంది. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల చార్జీని చదరపు అడుగుకు రూ.49.50కు పెంచుతూ ఐఎంఎస్ డైరెక్టర్ ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ధరలకు జీఎస్టీ అదనం. 2028 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకు రూ.70.15 వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఖైరతాబాద్‌లో ఈ మొత్తం రూ.70.49గా ఉంది 2020 నుంచి చదరపు అడుగుకు రూ.10 చొప్పునే చెల్లిస్తున్నారంటూ సీఎం ప్రజావాణికి పలువురు వినతులు సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సంస్థలు చార్జీలు పెంచాలని కోరడంతో 2025 మేలో చదరపు అడుగుకు రూ.25 చెల్లించేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. తాజాగా ఈ మొత్తాన్ని రూ.49.50కు పెంచారు. కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ చెల్లించేందుకు కూడా అనుమతులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, చార్జీలు పెరిగినా ఉద్యోగులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలాచోట్ల హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సిబ్బందికి నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల మధ్యే వేతనాలు చెల్లిస్తున్నారు. చార్జీల పెంపుతో ఉద్యోగులకు కనీసం రూ.35 వేలకు పైగా వేతనం అందాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రయోజనం కాంట్రాక్టర్లకే దక్కుతోందనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, ఉద్యోగులకు సంబంధించిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ నిధులు నెలల తరబడి జమ కావడం లేదని సమాచారం. ఈ సమస్యపై నాచారం ప్రాంతీయ ఆస్పత్రిలో

కొండపల్లికి ఉజ్వల భవిష్యత్తుకోసం కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఎన్టీఆర్ జిల్లా, కొండపల్లి,కొండపల్లి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు. కొండపల్లి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం 7, 8, 9, 10, 11 వార్డుల్లో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తో కలిసి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి అభ్యర్థులను గెలిపించి కొండపల్లి అభివృద్ధికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.రూ.96 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి.కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ.96 కోట్ల నిధులు కేటాయించామని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలను మెరుగుపరిచి, కొండపల్లిని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.అదేవిధంగా ఇంటింటికీ కుళాయి ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో రూ.55 కోట్లతో పనులు ప్రారంభమై కొనసాగుతున్నాయని వివరించారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయాలు కల్పించడంతో పాటు, మౌలిక వనతులను అభివృద్ధి చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నామని చెప్పారు.కేంద్రం, రాష్ట్రం, స్థానిక సంస్థల సమన్వయంతోనే అభివృద్ధి.కేంద్రంలో, రాష్ట్రంలో, స్థానిక మున్సిపాలిటీలో సమన్వయంతో కూడిన పాలన ఉంటే అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు పేర్కొన్నారు. అన్ని స్థాయిల్లో సమన్వయం ఉన్నప్పుడే నిధులను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు.కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల కల్పన కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.కూటమి అభ్యర్థులను గెలిపించండి.కొండపల్లి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో జనసేన అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తుపై, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై, భారతీయ జనతా పార్టీ అభ్యర్థులకు కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.కొండపల్లి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి అభ్యర్థుల విజయానికి ప్రజలు సహకరించాలని, అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తమ మద్దతు అందించాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు కోరారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) , టీడీపీ జనసేన, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హత జగన్ లేదు

పెనుకొండ/శ్రీసత్యసాయి, ప్రకృతి విపత్తుల సమయంలో రేయింబవళ్లు కష్టించి పనిచేసే సీఎం చంద్రబాబును ప్రజలు వరదల్లో మునిగిపోతుంటే ఐ మ్యాక్స్ థియేటర్ లో కూర్చొని ఎంజాయ్ చేసే జగన్ కు విమర్శించే అర్హత లేదని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మండిపడ్డారు. సంక్షేమానికి, అభివృద్ధికి సీఎం చంద్రబాబు బ్రాండ్ అంబాసిడరయితే, గుండాయిజానికి, రౌడీ యిజానికి కేరాఫ్ అడ్రస్ గొడ్డలి పార్టీని విమర్శించారు. ట్రిపుల్ సర్కార్ తో స్థానిక సంస్థలు మరింత అభివృద్ధి చెందుతాయని, మున్సిపల్ ఓటర్లు తమ రెండు ఓట్లను కూటమి అభ్యర్థులకు వేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా రాష్ట్రంలో సంక్షేమాన్ని, అభివృద్ధిని సీఎం చంద్రబాబు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ నిధులను, పెన్షన్ల కోసం ఒక్కరోజే రూ.5,825 కోట్లను లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అందజేసిందన్నారు. రైతులకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుంటూ ఈ ఏడాది రెండో విడత అన్నదాత – పీఎం కిసాన్ నిధులను అందజేస్తున్నామన్నారు. రెండో విడతగా రూ.7 వేల చొప్పున్న రైతుల ఖాతాల్లో రూ.3,125.47 కోట్లను జమ చేశామన్నారు. ఇప్పటికే మొదటి విడతగా ఈ ఏడాది జూన్ లో రూ.7 వేల చొప్పున అన్నదాత బ్యాంకు ఖాతాల్లో వేశామన్నారు. తమది రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హత జగన్ కు లేదు

తుఫాన్లు, వరదలు ముంచెత్తినప్పుడు ప్రజలను పట్టించుకోకుండా ఐ మ్యాక్స్ థియేటర్ ఎంజాయ్ చేసిన చరిత్ర జగన్ ది అని మంత్రి సవిత మండిపడ్డారు. ఆయన సీఎంగా ఉన్న సమయంలో హైపై సినిమా సెట్టింగ్ మాదిరిగా భారీ వేదిక నిర్మించి అక్కడి నుంచి నీటి మునిగిన పంట భూములను పరిశీలించారన్నారు. అన్నమయ్య డ్యామ్ కొట్టికపోయిన సమయంలో 42 మంది మృత్యువాత పడ్డారని, వారిని కూడా పరామర్శించిన పాపాన పోలేదని మండిపడ్డారు. తుఫాన్లు, వరదల సమయంలో ప్రజలు, బాధితుల గురించి పరితపించే వ్యక్తి సీఎం చంద్రబాబునాయుడన్నారు. గతంలో విజయవాడలో వరదలు వచ్చినప్పుడు అక్కడి కలెక్టరేట్ లో రాత్రి పగలు ఉండి...సహాయక చర్యలను పర్యవేక్షించారన్నారు. ఆర్నాబ్ తుఫాన్ రాకముందు నుంచే అధికారులను అప్రమత్తం చేసి, నష్టం తగ్గేలా కృషి చేశారన్నారు. ఇప్పటికే ఆర్నాబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం చంద్రబాబు... బాధితులందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు. వరదలు, తుఫాన్ లో సహాయక కార్యక్రమాల గురించి మాట్లాడే అర్హత జగన్ కు లేదన్నారు. మోకాల్లోతు బురదలో, నీటిలో దిగి... రైతన్నకు అండగా నిలిచే చంద్రబాబును విమర్శించే అర్హత కూడా జగన్ కు లేదని మంత్రి సవిత మండిపడ్డారు.ట్రిపుల్ సర్కార్ తోనే అభివృద్ధిడబుల్ ఇంజన్ సర్కార్ తో గతంలో రాష్ట్రంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి జరుగుతోందని మంత్రి సవిత తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తే..రాష్ట్రంలో ట్రిపుల్ ఇంజన్ సర్కార్ ఏర్పాటవుతుందన్నారు. దీనివల్ల స్థానిక సంస్థల్లో మరింత అభివృద్ధి చేపట్టడానికి వీలుకలుగుతుందన్నారు. రాష్ట్రంలో మున్సిపాల్టీ ప్రజలంతా అభివృద్ధికి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ప్రజలకు తమకు ఉండే రెండు ఓట్లను కూటమి అభ్యర్థులకే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. పెనుకొండలో టీడీపీ అభ్యర్థి త్రివేంద్ర నాయుడును, కౌన్సిలర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి సవిత కోరారు.

ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

విజయవాడ, సిద్ధార్థ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. ఎప్పటికప్పుడు ఏర్పాట్లను జనరల్, ఎక్స్పెండిచర్ అబ్జర్వర్లు పర్యవేక్షిస్తున్నారని అన్నారు. విజయవాడ కార్పొరేషన్తో పాటు 4 మున్సిపాలిటీల్లోని 222 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 1,142 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసారు. విజయవాడలో 19 మంది, నందిగామలో 5, జగ్గయ్యపేటలో 7, తిరువూరులో 7, కొండపల్లిలో 8 మంది పోటీ లో వున్నారు. వార్డు సభ్యులుగా విజయవాడలో 349, నందిగామలో 75, జగ్గయ్యపేటలో 94, తిరువూరులో 79, కొండపల్లిలో 106 మంది పోటీ చేస్తున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖతో సమన్వయం కొనసాగుతోంది.

ట్రంప్ హంటింగ్..నాన్ సిటిజన్లే టార్గెట్

వాషింగ్టన్:అమెరికాలో మధ్యంతర ఎన్నికల వేళ రాజకీయ వేడి మరింత పెరిగింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం.. పౌరసత్వం లేని వ్యక్తులు అక్రమంగా ఓటు వేశారన్న ఆరోపణలపై దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కనీసం 13 రాష్ట్రాల్లో పదుల వేల మంది ఓటర్ల వివరాలను అందించాలని కోరుతూ 100కు పైగా సబ్పీనాలు జారీ చేసినట్లు రాయిటర్స్ పరిశోధన వెల్లడించింది. వచ్చే వారం జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ముందు వెలుగుచూసిన ఈ పరిణామం అమెరికా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమెరికా ఎన్నికల్లో విదేశీయులు ఓటు వేస్తున్నారన్న ఆరోపణలకు విస్తృత స్థాయిలో ఆధారాలు లేవని పలు అధ్యయనాలు, రాయిటర్స్ విశ్లేషణలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన విస్తృత దర్యాప్తు.. ఎన్నికల పారదర్శకతను కాపాడే ప్రయత్నమా? లేక ఫలితాల అనంతరం న్యాయపరమైన వివాదాలకు బాటలు వేస్తున్న వ్యూహమా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

13 రాష్ట్రాల్లో ఓటర్ల వివరాల వేట

గత మూడు నెలల్లోనే అత్యధిక సబ్పీనాలు జారీ కాగా.. మరికొన్ని ఈ ఏడాది ఆరంభంలోనే ఇచ్చినట్లు రాయిటర్స్ గుర్తించింది. రాష్ట్ర, స్థానిక ఎన్నికల అధికారులకు ఈ ఆదేశాలు అందాయి. మిన్నియాపాలిస్, ఫిలడెల్ఫియా, లాస్ ఏంజెలెస్ వంటి డెమోక్రాట్ల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలతోపాటు.. టెక్సాస్, కాన్సాస్, జార్జియా వంటి పోటీ తీవ్రంగా ఉండే రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియ సాగుతోంది.వీటిలో కనీసం 49 సబ్పీనాలు గ్రాండ్ జ్యూరీల అధికారంతో జారీ చేసినవే. అంటే.. అవి నేర విచారణలకు సంబంధించినవై ఉండే అవకాశముంది. సాధారణంగా ఫెడరల్ సంస్థలు నేరుగా జారీ చేసే పరిపాలనా ఆదేశాలతో పోలిస్తే.. గ్రాండ్ జ్యూరీ సబ్పీనాలను న్యాయస్థానంలో సవాలు చేయడం మరింత కష్టమని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో సబ్పీనా అంటే.. నిర్దిష్ట రికార్డులు, పత్రాలు సమర్పించాలని లేదా సాక్ష్యమివ్వాలని ఆదేశించే చట్టబద్ధమైన ఉత్తర్వు. వీటి పరిధి ఒక్కో ఓటరుకు సంబంధించిన వివరాల నుంచి.. వేలాది మంది పేర్లున్న పూర్తి ఓటర్ల జాబితాల వరకు విస్తరించింది.

కాలిఫోర్నియాపైనే ప్రత్యేక దృష్టి

డెమోక్రాట్లకు బలమైన పట్టున్న కాలిఫోర్నియాలో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా ప్రతినిధుల సభలో ఎవరు ఆధిపత్యం సాధిస్తారన్న అంశాన్ని నిర్ణయించగల కీలక నియోజకవర్గాలు ఈ రాష్ట్రంలో ఉన్నాయి. ఇక్కడి ప్రభుత్వ విభాగాలకు కనీసం 17 సబ్పీనాలు జారీ అయినట్లు గుర్తించింది. రాష్ట్రంలో పౌరసత్వం లేని వ్యక్తులుగా భావిస్తున్న 20 వేల మందికి పైగా పోస్టల్ బ్యాలెట్లు అందాయని ఈ నెలలో అమెరికా న్యాయశాఖ ఆరోపించింది. వారి పౌరసత్వాన్ని నిర్ధారించే వరకు సంబంధిత ఓట్లను లెక్కించవద్దని కోరింది. అయితే.. కాలిఫోర్నియా అధికారులు ఈ జాబితా విశ్వసనీయతను ప్రశ్నించారు. 200 మంది ఓటర్ల నమోదును పరిశీలించగా.. దాదాపు 40 శాతం మంది అమెరికాలోనే జన్మించినవారిగా కనిపించారని పేర్కొన్నారు.కాలిఫోర్నియాలో ఓట్ల లెక్కింపు సాధారణంగా నెమ్మదిగా సాగుతుంది. తుది ఫలితాలు వెలువడటానికి కొన్నిసార్లు వారాలు పడుతుంది. ఈ వ్యవధిలో అక్రమ ఓటింగ్ ఆరోపణలు బలపడితే.. హోరాహోరీ పోటీల్లో గెలుపోటములపై వివాదాలు చెలరేగే ప్రమాదం ఉందని ఎన్నికల నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిన్నెసోటా నుంచి మసాచుసెట్స్ వరకు. సాంప్రదాయకంగా డెమోక్రాట్లకు అనుకూలంగా ఉండే మిన్నెసోటాలో ఈసారి సెనేట్ పోటీ అనూహ్యంగా ఉత్కంఠభరితంగా మారింది. మిన్నియాపాలిస్ పరిధిలోని అనోకా, హెన్నెపిన్ కౌంటీల్లో పలువురి ఓటింగ్ రికార్డుల కోసం సబ్పీనాలు జారీ అయ్యాయి. ఈ ప్రాంతాల్లో ట్రంప్ ప్రభుత్వం వలసదారులపై పెద్ద ఎత్తున తనిఖీలు చేపట్టింది.ఇప్పటివరకు ఈ రెండు కౌంటీలకు చెందిన కనీసం ఎనిమిది మందిపై పౌరసత్వం లేకుండానే ఓటు వేశారన్న ఆరోపణలతో న్యాయశాఖ కేసులు నమోదు చేసింది. అయితే.. ఆ కేసులన్నీ ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి. ఇప్పటివరకు ఎవరూ దోషులుగా నిర్ధారించబడలేదు.ఫిలడెల్ఫియాలోనూ కనీసం నాలుగు సబ్పీనాలు అందినట్లు స్థానిక అధికారులు ధ్రువీకరించారు. మరోవైపు మసాచుసెట్స్లోని ఎనిమిది నగరాలు, పట్టణాలపై ట్రంప్ మద్దతున్న ఫెడరల్ ప్రాసిక్యూటర్ గ్రాండ్ జ్యూరీ సబ్పీనాలు జారీ చేసినట్లు రాయిటర్స్ వెల్లడించింది. వీటిలో కొన్ని ప్రాంతాల్లో నమోదైన ఓటర్లందరి పేర్లు, చిరునామాలు, పార్టీ



అనుబంధాలు, పుట్టిన తేదీలు, ఓటింగ్ స్థితి, గుర్తింపు సంఖ్యలను సమర్పించాలని కోరారు.లిన్ నగరంలో 25 నుంచి 30 మంది వ్యక్తులకు సంబంధించిన రికార్డులను ఫెడరల్ ప్రాసిక్యూటర్లు కోరారు. ఇప్పటివరకు ఓటు వేయకూడని వ్యక్తి ఓటు వేసినట్లు ఒక్క ఉదంతమే గుర్తించామని ఆ నగర ఎన్నికల అధికారి జేమ్స్ లమన్నా పేర్కొన్నారు. ఇంతటి పరిమితమైన ఘటనలు ఎన్నికల సమగ్రతను దెబ్బతీసే స్థాయిలో లేవన్నది ఆయన అభిప్రాయం.

ఆధారాలెక్కడ.. ఆరోపణలెక్కడ?

అమెరికా ఎన్నికల్లో పౌరసత్వం లేని వ్యక్తులు ఓటు వేయడం తీవ్రమైన సమస్య అని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తోంది. ఇలాంటి ఘటనలను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవడానికి వందలాది ఫెడరల్ దర్యాప్తు అధికారులను రంగంలోకి దించినట్లు వైట్హౌస్ తెలిపింది.కానీ.. ఈ ఆరోపణలపై స్వతంత్ర పరిశీలనలు మరో కోణాన్ని చూపిస్తున్నాయి. పౌరసత్వం లేని వ్యక్తుల ఓటింగ్ చాలా అరుదుగా జరుగుతుందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. డ్రైవింగ్ లైసెన్సులు పొందే సమయంలో కార్యాలయపరమైన పొరపాట్లు లేదా సాఫ్ట్వేర్ లోపాల కారణంగా కొంతమంది విదేశీయుల పేర్లు ఓటర్ల జాబితాల్లో చేరిన సందర్భాలున్నాయి. అయితే.. వారిలో ఓటు వేసినవారు చాలా తక్కువ మందేనని రాష్ట్ర, స్థానిక అధికారులు చెబుతున్నారు.ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఫెడరల్ చట్టాల కింద పౌరసత్వం లేని వ్యక్తులు అక్రమంగా ఓటు వేశారన్న ఆరోపణలపై కనీసం 147 మందిపై ప్రాసిక్యూటర్లు కేసులు నమోదు చేసినట్లు రాయిటర్స్ విశ్లేషణ పేర్కొంది. వీరిలో 102 మందిపై సెప్టెంబరు ఆరంభం నుంచి కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో అత్యధికం ఇంకా పరిష్కారం కాలేదు. 2024లో ఓటు వేసిన ప్రతి పది లక్షల మందికి ఒకరి కంటే తక్కువగా ఈ కేసుల సంఖ్య ఉందని ఆ విశ్లేషణ తెలిపింది.ఇదిలా ఉండగా.. వాషింగ్టన్ రాష్ట్రంలో ఓటర్లుగా నమోదై ఉన్నట్లు కనిపిస్తున్న 400 మందికి పైగా పౌరసత్వం లేని వ్యక్తులను గుర్తించినట్లు ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఈ వారం తెలిపారు. వారి పౌరసత్వం నిర్ధారణ అయ్యే వరకు ప్రస్తుత బ్యాలెట్లను పక్కన పెట్టాలని ఎన్నికల అధికారులను కోరారు. ఇటీవలి వారాల్లో వ్యక్తిగత ఓటర్ల వివరాల కోసం ఫెడరల్ ప్రభుత్వం నుంచి సుమారు 60 సబ్పీనాలు అందాయని వాషింగ్టన్ రాష్ట్ర కార్యదర్శి కార్యాలయం రాయిటర్స్కు తెలిపింది.

ఎన్నికల తర్వాతే అసలు పోరా?

ఈ దర్యాప్తుల వెనుక ఎన్నికల అనంతర న్యాయపోరాటాలకు అవకాశం ఉందని కొందరు న్యాయ నిపుణులు భావిస్తున్నారు. హోరాహోరీ పోటీల్లో ఓడిపోయిన ట్రంప్ అనుకూల అభ్యర్థులు.. పౌరసత్వం లేని వ్యక్తుల ఓట్లు ఫలితాలను ప్రభావితం చేశాయని వాదించే అవకాశం ఉందని చెబుతున్నారు. అనుమానాస్పద ఓట్ల కారణంగా నిజమైన విజేతను నిర్ణయించడం సాధ్యం కాలేదంటూ బ్యాలెట్లను లేదా తుది ఫలితాలను రద్దు చేయాలని కోరవచ్చన్నది వారి విశ్లేషణ.అమెరికాలో ఎన్నికల నిర్వహణ ప్రధానంగా రాష్ట్రాల బాధ్యత. సాధారణంగా ఓడిపోయిన అభ్యర్థులు లేదా ఓటర్లు మాత్రమే ఫలితాలను సవాలు చేయగలిగేలా అనేక రాష్ట్రాల చట్టాలు ఉన్నాయి. అయినప్పటికీ.. విజేతల ఎన్నికల ధ్రువీకరణను ఆలస్యం చేయడానికి లేదా అడ్డుకోవడానికి న్యాయశాఖ చట్టపరమైన చర్యలు చేపట్టే అవకాశముందని నిపుణులు పేర్కొంటున్నారు. ఒబామా, ట్రంప్ ప్రభుత్వాల్లో పనిచేసిన మాజీ న్యాయశాఖ అధికారి బెన్ బెర్విక్ అభిప్రాయం ప్రకారం.. ఈ విచారణలు చట్టపరంగా బలహీనమైనప్పటికీ ఎన్నికల అనంతరం గందరగోళానికి దారితీయవచ్చు. మరోవైపు, జార్జ్ డబ్ల్యూ. బుష్ హయాంలో అరిజోనా ఫెడరల్ అటార్నీగా పనిచేసిన పాల్ చార్లన్.. ఈ సబ్పీనాలు రాష్ట్ర, స్థానిక ఎన్నికల అధికారుల దృష్టిని అసలు ఎన్నికల నిర్వహణ నుంచి మళ్లించే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు.

తుఫాన్ అనంతరం సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు ప్రభుత్వ నిరంతర కృషి



అమరావతి:ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మొగల్తూరు ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే ముందు మరోసారి సమీక్షించారు. విద్యుత్, రహదారులు, సమాచార వ్యవస్థల పునరుద్ధరణలో పురోగతిని అధికారులు వివరించారు. విద్యుత్ పునరుద్ధరణలో ఇతర రాష్ట్రాల నుంచి సహకారం తీసుకుని పనులు వేగవంతం చేసారు. ఇంకా ఇబ్బందులున్న ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. చివరి వ్యక్తికి సహాయం అందే వరకూ విశ్రమించేది లేదని చంద్రబాబు న్నారు.ప్రతిశాఖలో గ్రామ స్థాయిలో జరుగుతోన్న సహాయక చర్యలను తెలుసుకున్నారు. చివరి వ్యక్తికి సహాయం అందే వరకు, సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు ఇదే సంకల్పంతో పనిచేయాలని అధికారులకు సీఎం నూచించారు. సీఎం స్వయంగా క్షేత్రస్థాయి సిబ్బందితో మాట్లాడుతుండటంతో యుద్ధ ప్రాతిపదికన యంత్రాంగం పనులు పూర్తి చేసింది. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో నేటి ఉదయం 10 గంటల వరకూ ఉన్న పరిస్థితులను సమీక్షలో సీఎం చంద్రబాబుకు అదికారులు వివరించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం పనిచేస్తోంది. విద్యుత్, రవాణా, సమాచార వ్యవస్థల పునరుద్ధరణతో ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు వివిధ శాఖలు క్షేత్రస్థాయిలో పనులు కొనసాగిస్తున్నాయి. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిన 5,404 గ్రామాల్లో 4,881 గ్రామాలకు సరఫరా పునరుద్ధరించారు. సుమారు 90 శాతం గ్రామాల్లో విద్యుత్ తిరిగి అందుబాటులోకి వచ్చింది. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ప్రభావితమైన 552 సబ్స్టేషన్లలో 513 పునరుద్ధరించారు. సుమారు 93 శాతం పునరుద్ధరణ పూర్తికాగా, మరో 39 సబ్స్టేషన్లు పునరుద్ధరించాల్సి ఉంది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో విద్యుత్ సరఫరా నిలిచిన గ్రామాలన్నింటికీ సరఫరా పునరుద్ధరించారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ప్రభావితమైన 509 ప్రధాన 33 కేవీ ఫీడర్లలో 489, అలాగే 2,958 గ్రామీణ, స్థానిక సరఫరాకు సంబంధించిన 11 కేవీ ఫీడర్లలో 2,355 పునరుద్ధరించారు. తీవ్ర ప్రభావం పడిన కోనసీమలో 316 గ్రామాలకు గాను 87 గ్రామాల్లో, పశ్చిమ గోదావరిలో 318 గ్రామాలకు గాను 154 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరించారు. ఈ రెండు జిల్లాల్లోనే ఇంకా 393 గ్రామాలకు సరఫరా పునరుద్ధరించాల్సి ఉంది. కృష్ణా జిల్లాలో ఏపీసీపీడీసీఎల్ పరిధిలో ప్రభావితమైన 915 గ్రామాల్లో 867 గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరించారు. మొబైల్ సమాచార సేవల పునరుద్ధరణలోనూ పురోగతి. వివిధ సంస్థలకు చెందిన 1,045 ప్రభావిత మొబైల్ టవర్లలో 661 పునరుద్ధరించారు. మరో 384 టవర్ల పునరుద్ధరణ మిగిలి ఉంది. ఆర్ అండ్ బీ రహదారులపై కూలిన మొత్తం 2,270 చెట్లను తొలగించారు. ఒక్క కోనసీమ జిల్లాలోనే 1,334 చెట్లను తొలగించి రహదారులపై అడ్డంకులను తొలగించారు. ఆర్ అండ్ బీ రహదారులపై 137 చోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, 119 చోట్ల రాకపోకలను పునరుద్ధరించారు. తుఫాను కారణంగా 2,425.45 కిలోమీటర్ల దెబ్బతిన్న ఆర్ అండ్ బీ రహదారులు. శ్రీకాకుళంలో ఒక చోట నీటి ప్రవాహం కారణంగా ఒకవైపునే రాకపోకలు సాగుతున్నాయి. జలవనరుల శాఖ పరిధిలో ప్రభావితమైన 78 చెరువులు, 22 కాలువలు కలిపి మొత్తం 100 చోట్ల తాత్కాలిక పునరుద్ధరణ పూర్తయింది. 16 జిల్లాల్లో 3,52,254 హెక్టార్లలో వ్యవసాయ పంటలు ముంపునకు గురయ్యాయి. ఉద్యాన పంటలు 23,211 హెక్టార్లలో ప్రభావితమయ్యాయి. టనష్టంపై రాష్ట్రానికి కేంద్ర బృందాలు...వాస్తవ పరిస్థితులు వివరించి పంట నష్టంపై కేంద్ర సాయం పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అక్టోబర్ 26 నుంచి 29వ తేదీ వరకు వర్షాల వల్ల రాష్ట్రానికి సుమారు 380 టీఎంసీల నీరు వచ్చినట్లు అంచనా....ఇంకా కొనసాగుతోన్న వరద ప్రవాహాలు సమర్థ నీటి నిర్వహణతో రిజర్వాయర్లలో 4.68 టీఎంసీల నీరు అదనంగా చేరింది. మరో 5?6 టీఎంసీల నీరు చేరే అవకాశం ఉంది. చిన్న నీటిపారుదల చెరువుల్లోకి 22 టీఎంసీల నీరు చేరింది. మరో 8?12 టీఎంసీల నీరు చేరే అవకాశం వుంది. భూగర్భ జలాలు 44 టీఎంసీల మేర పెరిగాయి. రాబోయే ఐదు రోజుల ప్రవాహ అంచనాల్లో గొట్టా బ్యారేజీకి 16.24 టీఎంసీలు, మడ్డువలసకు 12.01 టీఎంసీలు వచ్చే అవకాశం వుంది.

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా..

హైదరాబాద్,రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమ షెడ్యూల్ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి మార్పు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈవోలు) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా మార్పులతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటర్ల తుది జాబితా నవంబర్ 30వ తేదీన ప్రచురితం కానుంది. ఈ మేరకు ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల సీఈవోలకు వేర్వేరుగా సమాచారం అందించింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై వచ్చిన క్లెయిమ్లు, అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించిన గడువును తెలంగాణలో నవంబర్ 26 వరకు, ఆంధ్రప్రదేశ్లో నవంబర్ 20 వరకు పొడిగించింది. వాస్తవానికి పాత షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నవంబర్ 9న, ఆంధ్రప్రదేశ్లో అక్టోబర్ 30నే తుది జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో సీఈవోల అభ్యర్థన మేరకు ఈసీ గడువును పొడిగించింది. సవరించిన షెడ్యూల్ వివరాలను క్షేత్రస్థాయి అధికారులందరికీ తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఈసీ తమ ఆదేశాల్లో స్పష్టం చేసింది. అదేవిధంగా మార్పు చేసిన షెడ్యూల్ గురించి రాజకీయ పార్టీలకు కూడా రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించింది.

గణాంకాల వివరాలు:

ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,64,87,213 మంది మాత్రమే తమ వివరాలను నమోదు చేసుకున్నారు. మిగిలిన 73,39,235 మంది ఓటర్లను వలస వెళ్లినవారు, మరణించినవారు, చిరునామా మారినవారు, నకిలీ ఓట్ల (యాఆఅ) కేటగిరీ కింద గుర్తించి డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించారు.అక్టోబర్ 29 నాటికి అందిన సమాచారం ప్రకారం.. తెలంగాణలో జారీ చేసిన 92,88,188 నోటీసులకు గానూ 92,81,189 నోటీసులు ఓటర్లకు అందజేశారు. వీటిలో 92,08,443 నోటీసులపై విచారణ పూర్తయింది. ఇప్పటివరకు మొత్తం 2,59,22,684 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి అధికారులు ఆమోదం తెలిపారు. వీరిలో 59,31,395 మంది ఓటర్ల విషయంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. మరో 30,64,168 మందిని 2002 నాటి జాబితా నుంచి మ్యాపింగ్ చేశారు. విచారణ అనంతరం 50,690 మంది ఓటర్లు జాబితాలో చేరడానికి అర్హులు కారని అధికారులు తేల్చారు.ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 44,28,858 నోటీసులపై విచారణ

అమిత్ షా టూర్ వెనుక భారీ వ్యూహం



హైదరాబాద్, తెలంగాణ రాజకీయ రంగంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంశం కాంగ్రెస్, బీజేపీల మధ్య రగులుతోంది. ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ నినాదంతో నిర్వహించనున్న భారీ ర్యాలీకి సవాల్ విసురుతూ.. మరుసటి రోజే నవంబర్ 2న భాగ్యనగరంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రత్యక్షంగా పాల్గొనేలా లోక్‌తంత్ర బచావో – అరాజకతా హటావో పాదయాత్రను బీజేపీ ఖరారు చేసింది. ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల సవరణ ప్రక్రియను రాజకీయం చేస్తూ, కాంగ్రెస్ ఆడుతున్న నాటకాలను తిప్పికొట్టడమే లక్ష్యంగా చాణక్యుడు స్వయంగా రంగంలోకి దిగుతుండటంతో జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు ఈసీ ప్రక్రియపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారనేది బీజేపీ ప్రధాన ఆరోపణ. మరణించినవారు , శాశ్వతంగా చిరునామాలు మారినవారు ,అడ్రస్‌లో లేనివారు, రెండు చోట్ల నమోదు చేసుకున్న డూప్లికేట్ ఓట్లను సాంకేతిక ఆధారాలతో ఈసీ తొలగిస్తుంటే, దానిని ఓట్ల చోరీ అని కాంగ్రెస్ ప్రచారం చేస్తోందని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. చట్టబద్ధమైన సవరణ ప్రక్రియను అరాచకత్వంగా మార్చాలని చూస్తున్న కాంగ్రెస్ వైఖరిని ప్రజల వద్దకే వెళ్లి ఎండగట్టడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశం.ఈ పరిణామం వెనుక బీజేపీ జాతీయ నాయకత్వం సుదీర్ఘ రాజకీయ వ్యూహం దాగి ఉందనేది స్పష్టమవుతోంది. ముఖ్యంగా తెలంగాణను రాబోయే రోజుల్లో కైవసం చేసుకోవాలనే దృఢ సంకల్పంతో ఉన్న అమిత్ షా, ఈ ఓటర్ల జాబితా రచ్చను కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పొలిటికల్ అస్త్రంగా మలుచుకోవాలని చూస్తున్నారు. రాహుల్ గాంధీ డిఫెన్స్ లోకి నెట్టిన ప్రతిసారీ ప్రత్యక్షంగా తానే వేదికపైకి వచ్చి కౌంటర్ ఇవ్వడం అమిత్ షా శైలి. హైదరాబాద్ ట్యాంక్ బండ్ పరిసరాల్లో వేలాదిమంది శ్రేణులతో సాగనున్న ఈ పాదయాత్ర ద్వారా సౌత్ ఇండియాలో కాంగ్రెస్ నరేటివ్‌ను పూర్తిగా పటాపంచలు చేయాలని భావిస్తున్నారు.రాష్ట్రంలో నెలకొన్న కరువు, తాగునీటి ఎద్దడి వంటి ప్రజా సమస్యలను పక్కనబెట్టి సీఎం రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు 'ఢిల్లీ ర్యాలీ' కోసం గాల్లో విహరిస్తున్నారని బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నిజమైన ఓటర్ల పేర్లు ఎక్కడైనా తొలగించి ఉంటే ఆధారాలతో చూపించాలని, సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లికి రావడానికైనా తాము సిద్ధమని సవాల్ విసిరారు. ఓటర్లకు ఉన్న ఫారమ్-6 హక్కును వివరించకుండా, ఓట్ల పేరుతో కాంగ్రెస్ కేవలం రాబోయే స్థానిక ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తోందని ధ్వజమెత్తారు. మరోవైపు, బిఆర్ఎస్ స్థానంలో కాంగ్రెస్‌కు ఏకైక ప్రత్యామ్నాయంగా తమను తాము నిలబెట్టుకోవడానికి బీజేపీకి ఇది ఒక సువర్ణావకాశంగా మారింది. తెలంగాణలో అధికారం చేజిక్కించుకోవాలంటే కేవలం అసెంబ్లీ స్థానాలే కాకుండా, హైదరాబాద్, రంగారెడ్డి లాంటి అర్బన్ సెంటిమెంట్‌ను తమవైపు తిప్పుకోవడం అత్యంత కీలకం. అందుకే అమిత్ షా నేరుగా వీధుల్లోకి వచ్చి పాదయాత్ర చేయడం ద్వారా కమలం క్యాడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు, తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిపక్ష పాత్రను రీ-ఛార్జ్ చేయబోతున్నారు. ఢిల్లీలో రామ్‌లీలా మైదాన్ ర్యాలీతో కాంగ్రెస్ వేసిన ఎత్తుకు, మరుసటి రోజే హైదరాబాద్ పాదయాత్రతో అమిత్ షా వేస్తున్న పైఎత్తు దేశ రాజకీయాల్లో ప్రధాన ఆకర్షణగా మారింది. ఎన్నికల సమయానికి ఇంకా సమయం ఉన్నప్పటికీ, ఈ ఓటర్ల జాబితా సమరం ద్వారా కాంగ్రెస్-బీజేపీలు తెలంగాణ నేతలను జాతీయ స్థాయి రాజకీయ కురుక్షేత్రంగా మార్చేశాయనడంలో ఎలాంటి సందేహం లేదు.కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నవంబర్ 2న తెలంగాణలో పర్యటనతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీజేపీ రాష్ట్ర నాయకత్వం, భారీ ఎత్తున జన సమీకరణ చేసేందుకు సమాయత్తమవుతోంది.అమిత్ షా పర్యటన, పాదయాత్ర ఏర్పాట్లపై బీజేపీ ముషీరాబాద్ సీనియర్ నాయకులు రామచందర్ రావు, బీజేపీ సహ ఇంచార్జి అభయ్ పాటిల్, పార్టీ ప్రధాన కార్యదర్శులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. కార్యక్రమాన్ని ప్రజాక్షేత్రంలో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు. ఈ పర్యటనలో 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం.. అరాచకత్వంను అంతంచేద్దాం' అనే ప్రధాన నినాదంతో బీజేపీ భారీ పాదయాత్రను చేపట్టనుంది. కేవలం ఏదో ఒక గ్రౌండ్ లో లేదా వేదికలకే పరిమితం కాకుండా, నేరుగా ప్రజల మధ్య నుంచే పాదయాత్ర సాగాలని కేంద్ర బీజేపీ అగ్ర నాయకత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర నాయకత్వం ఆదేశాలతో బీజేపీ నేతలు నాంపల్లిలోని చారిత్రాత్మక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, మొజంజాహీ మార్కెట్ పరిసర ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. పాదయాత్ర రూట్ మ్యాప్, రద్దీ నియంత్రణ, వేదిక ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడారు.తెలంగాణలో రాబోయే ఎన్నికలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా అమిత్ షా పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అధికార పార్టీ వైఫల్యాలను, పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ యాత్ర ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. కేంద్ర మంత్రి అమిత్ షా స్వయంగా ర్యాలీ చేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీజేపీ శ్రేణులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలో తమ బలాన్ని మరోసారి నిరూపించుకోవాలని బీజేపీ నాయకులు యోచిస్తున్నారు.

క్లైమాక్స్ కు విజయవాడ మేయర్ ఎన్నికల సమరం



విజయవాడ ,ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకు గుండెకాయ వంటి విజయవాడ నగర పాలక సంస్థ మేయర్ ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరుతున్న వేళ, క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలు స్పష్టమైన ఏకపక్ష తీర్పును సూచిస్తున్నాయి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగిన వంగవీటి రాధాకృష్ణ అనూహ్యమైన ప్రజా మద్దతుతో అత్యంత పటిష్టమైన స్థితిలో దూసుకుపోతున్నారు. బెజవాడ ప్రజానీకంలో వంగవీటి కుటుంబానికి ఉన్న భావోద్వేగ అనుబంధం, దివంగత రంగా అభిమానుల అండదండలతో పాటు, కూటమి పార్టీల ఓటు బ్యాంక్ ఏకతాటిపైకి రావడం రాధాకు అధిక్యాన్ని తెచ్చిపెడుతోంది. డివిజన్లలో కూటమి ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమా, సుజనా చౌదరి, జనసేన నేతలు సమన్వయంతో సాగిస్తున్న ప్రచారం రాధా విజయాన్ని ముందే ఖరారు చేసినట్లు కనిపిస్తోంది.గత మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.. ఈసారి కనీస పోటీని కూడా ఇవ్వలేక ఘోరమైన ఆత్మరక్షణలో పడిపోయింది. రాధా వంటి మాస్ లీడర్‌ను ఢీకొట్టేందుకు బలమైన సామాజిక, రాజకీయ నేపథ్యం ఉన్న అభ్యర్థిని రంగంలోకి దించడంలో ఆ పార్టీ అధిష్ఠానం విఫలమైంది. ఓటమి ఖాయమని ముందే గ్రహించిన నగరానికి చెందిన ముఖ్య నేతలు, మాజీ మంత్రులు పోటీకి పూర్తిగా ముఖం చాటేశారు. దీంతో అనివార్య పరిస్థితుల్లో మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మికే మళ్లీ టికెట్ కేటాయించాల్సి వచ్చింది. అయితే ఆమె ప్రచారం ఏమాత్రం ఊపు లేకుండా అత్యంత సాదాసీదాగా సాగుతుండటం, గత ఐదేళ్ల పాలనలో కార్పొరేషన్‌లో జరిగిన అవినీతి, పన్నుల భారం వంటి ప్రజావ్యతిరేక అంశాలు ఆమెకు తీవ్ర ప్రతిబంధకంగా మారాయి.వైసీపీ శ్రేణుల్లో నెలకొన్న అంతర్గత అసంతృప్తి, ముఖ్య నేతల సహాయ నిరాకరణ భాగ్యలక్ష్మి అవకాశాలను పూర్తిగా సమాధి చేస్తున్నాయి. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్, మల్లాది విష్ణు వంటి కీలక నేతలు ఎవరికి వారే నామమాత్రంగా దర్శనమిచ్చి వెళ్లిపోతుండటం కేడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. నగరంలో ఎక్కడా వైసీపీ ప్రచార హోరు కనిపించకపోవడం, పార్టీ ఇచ్చిన హామీలపై ప్రజల్లో నమ్మకం లేకపోవడంతో కార్పొరేటర్ అభ్యర్థులు సైతం సొంత ఖర్చులతో రిస్క్ తీసుకోలేక చేతులెత్తేస్తున్నారు. నాయకత్వ లేమి, సమన్వయ లోపంతో నగరంలో వైసీపీ ఉనికి కేవలం సోషల్ మీడియా పోస్టులకే పరిమితమవుతోంది.ఇదే సమయంలో, ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా నిలిచి ప్రత్యేక ఆకర్షణగా మారిన మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు వ్యవహారం క్షేత్రస్థాయిలో ఆశించిన ప్రభావం చూపలేకపోతోంది. బెజవాడను నిజాయితీగా, అవినీతి రహితంగా తీర్చిదిద్దుతానంటూ ఆయన ప్రచారం మొదలుపెట్టినప్పటికీ.. ఆయన కార్యాచరణ అంతా ఏసీ రూములు, మేధావుల సదస్సులు, యూట్యూబ్ ఇంటర్వ్యూలు, సోషల్ మీడియా లైవ్‌లకే పరిమితమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయిలో బస్తీ ప్రజలు, సామాన్య కార్మికులు, నిరుపేద ఓటర్లను నేరుగా ఆకట్టుకునే మాస్ కనెక్ట్ ఆయన వద్ద లేకపోవడం ప్రధాన లోపంగా మారింది. మేధావి వర్గంలో కొంత సానుభూతి లభించినా, అది విజయానికి అవసరమైన సంఖ్యాబలంగా మారే అవకాశాలు కనిపించడం లేదు.బెజవాడ ఎన్నికల ముఖచిత్రాన్ని పరిశీలిస్తే.. కూటమి అభ్యర్థి వంగవీటి రాధా ప్రచారంలోనూ, ప్రజాధారణలోనూ ప్రత్యర్థుల కంటే మైళ్ల దూరంలో ముందంజలో ఉన్నారు. వంగవీటి కుటుంబానికి నగరంతో ఉన్న సుదీర్ఘ అనుబంధం, కూటమి సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు రాధాకు దన్నుగా నిలుస్తున్నాయి. విపక్ష వైసీపీ నిస్తేజం, ఏబీవీ ప్రభావం నామమాత్రమే కావడంతో.. బెజవాడ మేయర్ పీఠంపై కూటమి జెండా ఎగరడం లాంఛనమేనని స్పష్టమవుతోంది. రాజధాని నగర పరిధిలో విజయవాడ కార్పొరేషన్‌ను దక్కించుకోవడం ద్వారా అమరావతి బ్రాండ్‌ను, కూటమి రాజకీయ ఆధిపత్యాన్ని మరింత సుస్థిరం చేసుకునే దిశగా రాధా ప్రయాణం సాఫీగా సాగుతోంది.

పనబాక కుమార్తెకు కీలక పదవి.. టీడీపీ అధిష్ఠానం సంకేతాలు



తిరుపతి:తిరుపతి జిల్లా పరిషత్ మొదటి ఛైర్‌పర్సన్‌గా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి కుమార్తె డాక్టర్ పనబాక చేతన పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎస్సీ మహిళకు రిజర్వు అయిన తిరుపతి జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని చేతనతోపాటు మాజీ ఎమ్మెల్యే హేమలత ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే యవత, విద్యావంతురాలు అన్న ఆలోచనతో అధిష్టానం డాక్టర్ చేతన పేరుపై మొగ్గు చూపుతోందని టాక్ నడుస్తోంది. ఇప్పటికే డాక్టర్ చేతన పేరును ఖరారు చేసిందని, అధికారిక ప్రకటన ఒక్కటే విడుదల చేయాల్సివుందని అంటున్నారు. సీనియర్ నాయకురాలు పనబాక లక్ష్మి సేవలు, సుదీర్ఘ రాజకీయ అనుభవానికి తగిన న్యాయం చేయాలనే ఆలోచనతో టీడీపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

తొలి ఛైర్‌పర్సన్‌గా చేతన

తిరుపతి జిల్లా కొత్తగా ఏర్పడిన తర్వాత జిల్లా పరిషత్‌కు జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవి. నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు తిరుపతి జిల్లా పరిధిలోకి చేరడంతో జడ్పీ పరిధి కూడా విస్తరించింది. ఈ నూతన జిల్లా పరిషత్‌కు తొలి ఛైర్‌పర్సన్‌గా విద్యావంతురాలు, యువ నాయకురాలు డాక్టర్ పనబాక చేతన పేరును అధిష్టానం ఖరారు చేసేందన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. శ్రీకాళహస్తి రూరల్ జడ్పీటీసీ సభ్యురాలిగా చేతన ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజకీయంలోకి కొత్తగా అడుగుపెట్టినప్పటికీ, మొదటి ప్రయత్నంలోనే జడ్పీటీసీగా ఏకగ్రీవంగా గెలుపొంది తన సత్తా చాటారు. ఇప్పుడు అధిష్టానం అవకాశం ఇస్తే, తిరుపతి జిల్లా పరిషత్‌కు మొట్టమొదటి జడ్పీ ఛైర్‌పర్సన్గా చరిత్రకెక్కే అవకాశముందని అంటున్నారు.

పనబాక లక్ష్మి సీనియార్టీకి గుర్తింపు

కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీలో చేరారు. 2019 సాధారణ ఎన్నికలతో పాటు, ఆ తర్వాత జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలోనూ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ పట్ల ఆమె చూపిన నిబద్ధత, సీనియార్టీని గుర్తించిన అధిష్టానం ఆమెకు టిటిడి బోర్డు సభ్యురాలిగా అవకాశం కల్పించింది. అయినప్పటికీ, ఆమె ఉన్నత స్థాయి రాజకీయ అనుభవానికి తగినంత గుర్తింపు ఇంకా దక్కలేదన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పనబాక లక్ష్మి కుమార్తె చేతనకు జిల్లా స్థాయిలో అత్యున్నతమైన జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టడం ద్వారా పనబాక కుటుంబానికి తగిన ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం చేయాలని టీడీపీ యోచిస్తోందని అంటున్నారు.

ఉన్నత విద్యావంతురాలు

డాక్టర్ పనబాక చేతన డెర్మటాలజీ (చర్మ వైద్యం)లో ఎండి చేసిన ఉన్నత విద్యావంతురాలు. కేంద్ర మంత్రిగా పనిచేసినా ఎప్పుడూ వినయం, సౌశీల్యం, మృదుభాషణ విడవని పనబాక లక్ష్మి పెంపకంలో పెరిగిన చేతన, అదే సంస్కారాన్ని పుణికిపుచ్చుకున్నారని ప్రశంసలు అందుకుంటున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులు కూడా గౌరవించే వ్యక్తిత్వం పనబాక లక్ష్మి సొంతమని, అటువంటి విలువలున్న కుటుంబం నుంచి వచ్చిన చేతన టీడీపీకి అత్యంత గౌరవప్రదమైన అభ్యర్థి అవుతారనడంలో సందేహం లేదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గతంలో పనబాక లక్ష్మి తిరుపతి లోక్‌సభకు పోటీ చేసిన సమయంలో చేతన విస్తృత ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ స్వల్ప రాజకీయ అనుభవంతో ఏకంగా జడ్పీ ఛైర్‌పర్సన్ పీఠం దక్కించుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.

రాయదుర్గం,ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో వన్ వే



హైదరాబాద్, హైదరాబాద్ ఐటీ కారిడార్‌తో పాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిత్యం వేలాది మంది టెక్కీలను, వాహనదారులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రెండు ప్రధాన జంక్షన్లలో త్వరలోనే వన్ వే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాల్లో సమగ్ర ట్రాఫిక్ అధ్యయనం నిర్వహించిన అధికారులు, వన్ వే విధానం అమలు సాధ్యాసాధ్యాలను పూర్తిస్థాయిలో పరిశీలించి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గతంలో కేటీఆర్ పార్క్ వద్ద అమలు చేసిన వన్ వే వల్ల దాదాపు 6 కిలోమీటర్ల మేర అదనపు ప్రయాణం చేయాల్సి రాగా, ఇక్కడ మాత్రం వాహనదారులకు కేవలం 2 కిలోమీటర్ల మేర మాత్రమే అదనపు ప్రయాణ భారం పడనుంది.ఈ కొత్త ట్రాఫిక్ నిబంధనల వల్ల ఐటీ కారిడార్‌లో కనీసం 40 శాతం మేర ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దశలవారీగా చేపట్టనున్న ఈ ప్రణాళికలో భాగంగా.. తొలుత వారం, రెండు వారాల వ్యవధిలోనే రాయదుర్గం జంక్షన్ పరిసరాల్లో వన్ వే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మరో కీలక జంక్షన్‌లోనూ దీనిని విస్తరిస్తారు. ఈ మార్పుల వల్ల ఉద్యోగులకు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు సమీపంలోని కార్పొరేట్ కంపెనీలు, వాణిజ్య సంస్థలు, మాల్స్, విద్యాసంస్థల యాజమాన్యాలకు ముందస్తు సమాచారం అందించి వారిని సమాయత్తం చేస్తున్నారు.మరోవైపు, పీక్ అవర్లలో ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించేందుకు ఆర్టీసీతో చేతులు కలిపిన సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు.. వినూత్నంగా కాంట్రా ఫ్లో ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రవేశపెట్టనున్నారు. తీవ్ర రద్దీ ఉండే జేఎన్‌టీయూ, హఫీజ్‌పేట్, రాయదుర్గం జంక్షన్లను గుర్తించి, జేఎన్‌టీయూ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు అలాగే తిరుగు ప్రయాణంలో ఈ బస్సులను నడపనున్నారు. వన్ వే అమలయ్యే రూట్లలో క్లాక్‌వైజ్ , యాంటీ క్లాక్‌వైజ్ దిశల్లో ఎలాంటి మధ్యంతర హాల్ట్‌లు లేకుండా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా వీటిని డిజైన్ చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ దాదాపు 20 నుంచి 30 ప్రత్యేక బస్సులను కేవలం ఐటీ ఉద్యోగుల రాకపోకల కోసమే రంగంలోకి దించనుంది.కేవలం వాహనాల కదలికలే కాకుండా.. ప్రధాన రహదారులపై మనుషులు అడ్డదిడ్డంగా దాటడం వల్ల వాహనాల వేగం మందగించి ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని అధికారులు గుర్తించారు. ఈ సమస్యకు అడ్డుకట్ట వేసేందుకు సైబరాబాద్ పరిధిలోని పలు కీలక కూడళ్లలో అత్యాధునిక స్కైవాక్‌లను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పాదచారులు రోడ్లపైకి రాకుండా పైనుంచే సురక్షితంగా వెళ్లేలా స్కైవాక్‌లను అనుసంధానించడం ద్వారా పాదచారుల భద్రత పెరగడంతో పాటు, రహదారులపై వాహనాల రాకపోకలు నిరంతరాయంగా సాగి నగరవాసులకు ట్రాఫిక్ నరకం నుంచి భారీ ఉపశమనం లభించనుంది.

బహుదా నదికి పోటెత్తిన వరద..

శ్రీకాకుళం:అర్నబ్ తుఫాన్ ప్రభావంతో.. శ్రీకాకుళం జిల్లాలో కురిసిన వర్షాలకు నదులలో వరద పోటెత్తింది. వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బహుదా నదుల్లోకి వరద నీరు భారీగా చేరింది. ఎగువన ఒడిశాలోని భగలట్టి డ్యామ్ వద్ద గేట్లు ఎత్తివేయడంతో పాటు భారీ వర్షాల వల్ల ఇచ్ఛాపురంలోని బహుదా నది ఉగ్రరూపం దాల్చింది. దాంతో పదుల సంఖ్యలో గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పలు చోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

రేషన్ బియ్యం స్కామ్ గుట్టురట్టు.. రీసైక్లింగ్ చేసి బ్రాండెడ్ పేరుతో విక్రయం



హైదరాబాద్, హైదరాబాద్ పరిధిలో దర్జాగా సాగుతున్న భారీ రేషన్ బియ్యం మాఫియా అక్రమాలను సివిల్ సప్లైస్, విజిలెన్స్ చెక్ పెట్టాయి. పేదలకు ప్రభుత్వం అతి తక్కువ ధరకు లేదా ఉచితంగా సరఫరా చేసే రేషన్ బియ్యాన్ని దళారులు అక్రమ మార్గాల్లో సేకరించి, వాటిని రీ-సైక్లింగ్ చేసి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. కర్మన్ ఘాట్ పరిసరాల్లోని ప్రముఖ రైస్ డిపోలు, గోదాములపై ఉన్నతాధికారులు దాడులు చేశారు. ఈ సోదాల్లో పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన రేషన్ బియ్యం సంచులు, కల్తీ ప్రాసెసింగ్ యంత్రాలను అధికారులు సీజ్ చేశారు. రేషన్ లబ్ధిదారుల నుంచి లేదా రేషన్ డీలర్ల నుంచి అతి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని మాఫియా ఏజెంట్లు సేకరిస్తారు. ఇలా సేకరించిన లావు బియ్యాన్ని రైస్ మిల్లులు, డిపోల్లో ప్రత్యేక యంత్రాల ద్వారా పాలిష్ పట్టిస్తారు. దీనివల్ల బియ్యం తెల్లగా, సన్న బియ్యం మాదిరిగా కనిపిస్తాయి. రీ సైకిల్ చేసిన ఈ బియ్యాన్ని ప్రముఖ, పేరుగాంచిన బ్రాండెడ్ కంపెనీల కవర్లు, డూప్లికేట్ బ్యాగుల్లో ప్యాక్ చేస్తారు. మార్కెట్లో ఈ కల్తీ బియ్యాన్ని కిలో రూ. 80 నుంచి రూ. 100 వరకు విక్రయిస్తూ వినియోగదారులను దారుణంగా మోసం చేస్తున్నారు.రేషన్ బియ్యాన్ని పదే పదే పాలిష్ చేయడం ద్వారా వాటిలో ఉండాల్సిన పోషకాలు కోల్పోతాయి. ప్రాసెసింగ్ సమయంలో వాడే రసాయనాల వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేషన్ అక్రమ తరలింపునకు సహకరిస్తున్న డీలర్లు, మిల్లుల యజమానులు, దళారులపై పి.డి. యాక్ట్ కింద కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు జరగకుండా బయోమెట్రిక్ ట్రాకింగ్, జీపీఎస్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ తెలిపింది.

మోడీకి సరే... మిగిలిన ఎన్నికల్లో ఏమౌతోంది



లక్నో: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆధ్యాత్మిక రాజధాని వారణాసిలో ఎన్నికల ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని మోదీ ఇక్కడి నుంచి లక్షల ఓట్ల ఆధిక్యంతో జయకేతనం ఎగురవేస్తూ వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయి స్థానిక సంస్థలు, శాసనమండలి ఎన్నికల విషయానికి వచ్చేసరికి బీజేపీ సవాళ్లను ఎదుర్కొంటోంది. తాజాగా జరిగిన యూపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారణాసి ఉపాధ్యాయ స్థానాన్ని సమాజ్‌వాదీ పార్టీ సిట్టింగ్ అభ్యర్థి లాల్ బిహారీ యాదవ్ భారీ తేడాతో నిలబెట్టుకుని బీజేపీ అభ్యర్థి ప్రమోద్ మిశ్రాను మట్టికరిపించగా, పట్టభద్రుల స్థానంలోనూ ఎస్పీ అభ్యర్థి అశుతోష్ సిన్హా తిరుగులేని ఆధిపత్యాన్ని కనబరిచారు. సాక్షాత్తూ దేశ ప్రధాని నియోజకవర్గంలోనే విద్యావంతులు, ఉద్యోగ వర్గాలు బీజేపీకి వ్యతిరేకంగా తీర్పునివ్వడం రాజకీయ వర్గాలను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది.2014లో నరేంద్ర మోదీ వారణాసి నుంచి లోక్‌సభకు ఎన్నికైన నాటి నుంచి గత పన్నెండేళ్ల స్థానిక ఎన్నికల ఫలితాల చరిత్రను పరిశీలిస్తే ఫలితాలు ఇలాగే వస్తున్నాయి. 2020లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇదే తరహా పరిణామం ఎదురైంది. దాదాపు పదేళ్ల పాటు బీజేపీ చేతిలో ఉన్న వారణాసి గ్రాడ్యుయేట్స్, టీచర్స్ స్థానాలు రెండింటినీ సమాజ్‌వాదీ పార్టీ చేజిక్కించుకుని కమలనాథులకు ఊహించని షాక్ ఇచ్చింది. అంతకుముందు బీజేపీ అభ్యర్థి కేదార్‌నాథ్ సింగ్ ప్రాతినిధ్యం వహించిన గ్రాడ్యుయేట్స్ సీటును ఎస్పీ ఎగరేసుకుపోవడం నాడే రాష్ట్రవ్యాప్తంగా పెను ప్రకంపనలు సృష్టించింది. లోక్‌సభలో మోదీ ఇమేజ్ పనిచేస్తున్నప్పటికీ, పరోక్ష, విద్యావంతుల ఓటింగ్ విధానాల్లో మాత్రం స్థానిక అసంతృప్తులు బ్యాలెట్ బాక్సుల్లో బయటపడుతూనే ఉన్నాయి.ఎమ్మెల్సీ ఎన్నికలకే పరిమితం కాకుండా, వారణాసి జిల్లా పరిషత్, పంచాయతీరాజ్ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీకి ఆశించిన స్థాయిలో పట్టు దక్కలేదు. 2015, 2021 పంచాయతీ ఎన్నికల్లో జిల్లా పంచాయతీ వార్డు సభ్యుల స్థానాల్లో సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ తో పాటు స్వతంత్రులే అధిక స్థానాల్లో గెలుపొందారు. క్షేత్రస్థాయి గ్రామీణ ఓటర్లలో బీజేపీ సొంత బలంతో సాధారణ మెజార్టీని సాధించలేకపోయింది; తదనంతర రాజకీయాల్లో ఇతర పక్షాల మద్దతుతో, అధికార బలాన్ని ఉపయోగించి జిల్లా పంచాయతీ అధ్యక్ష పీఠాన్ని దక్కించుకున్నప్పటికీ.. బూత్ స్థాయి ప్రజాతీర్పులో ఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులే పైచేయి సాధించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. నగర ప్రాంత మున్సిపల్ కార్పొరేషన్‌లో మేయర్ పీఠాన్ని బీజేపీ నిలబెట్టుకుంటున్నప్పటికీ, డివిజన్ వార్డుల్లో మాత్రం విపక్షాలు గట్టి పోటీనిస్తూనే ఉన్నాయి.ప్రధానమంత్రి వ్యక్తిగత చరిష్మా, జాతీయవాదం, కాశీ విశ్వనాథ్ కారిడార్ వంటి భారీ ప్రాజెక్టులు లోక్